# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - ఆదివారం 3 ఆగస్టు 2025 | సంపుటి:9 | సంచిక:217 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## ఆమె ఓ మెషీన్‌గన్

వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీపై ట్రంప్ ప్రశంసలు



2

## 16 నుంచి అమృత్ ఉద్యాన్ సందర్శన



2




# రైతులకు అందుబాటులో సాంకేతిక పరిజ్ఞానం

### పథకాలతో పేదలను గట్టెక్కించాలన్నదే నా లక్ష్యం

### వీరాయపాలెంలో 'అన్నదాత సుఖీభవ' ప్రారంభించిన చంద్రబాబు

ఒంగోలు, (మనం న్యూస్): రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రైతు రాజుగా మారాలి. ఎన్ని కష్టాలు ఉన్నా.. ప్రజలు సుఖసంతోషాల తో ఉండాలనేది నా ఆకాంక్ష. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ పథకాలతో పేదలను గట్టెక్కించాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. ప్రకాశం జిల్లా దర్శి మండలం తూర్పు వీరాయపాలెంలో 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన అనంతరం.. పొలాల వద్ద వినూత్నంగా ఏర్పాటు చేసిన వేదికపై రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతుల చెప్పిన సమస్యలపై స్పందించిన సీఎం.. వాటిని పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులు 'అన్నదాత సుఖీభవ' ద్వారా లబ్ధి పొందనున్నారు. మొదటి విడతలో రాష్ట్ర వాటాగా ఒక్కో రైతుకు రూ.5 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశారు. దీనికి తోడుగా కేంద్రం 'పీఎం కిసాన్' పథకం కింద మొదటి

...మిగతా 2లో





### 46,85,838 మంది రైతులకు లబ్ధి

#### రైతులతో సిఎం చంద్రబాబు ముచ్చట్లు

ఒంగోలు: అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులకు లబ్ధి చేకూరిందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. మొదటి విడతలో రాష్ట వాటాగా ఒక్కో రైతుకు

...మిగతా 2లో



## జగన్‌కు కేజీకి, టన్నుకు తేడా తెలియదు

### హోం మంత్రి అనిత

గజపతినగరం: పొగాకు రైతుల దగ్గరికి వెళ్లిన జగన్ మోహన్‌రెడ్డి కేజీకి, టన్నుకు తేడా తెలియకుండా మాట్లాడుతున్నారని ఏపీ హోంమంత్రి అనిత ఆరోపించారు. మామిడి రైతుల దగ్గరికి వెళ్లి.. మామిడి కాయలు తొక్కించిన ఘనత ఆయనకే

...మిగతా 2లో





## పాలకొల్లులో మంత్రి నిమ్మల భారీ ట్రాక్టర్ ర్యాలీ

పాలకొల్లు: ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. రాష్ట్రంలో 'అన్నదాతా సుఖీభవ' పథకం అమలు చేసిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతూ.. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో రైతులతో కలిసి వందలాది ట్రాక్టర్లపై మంత్రి భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయన స్వయంగా ట్రాక్టర్ నడిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజుతో కలిసి స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం పాలకొల్లు నియోజకవర్గంలోని రైతులకు రూ.9.85 కోట్ల విలువైన అన్నదాతా సుఖీభవ చెక్కులను రైతులకు అందజేశారు. అర్హులైన ప్రతిరైతుకు పథకం వర్తింపజేస్తామన్నారు.

## బసవతారకం ఆస్పత్రికి 13న శంకుస్థాపన

### ఏర్పాట్లను పరిశీలించిన బాలకృష్ణ



అమరావతి: అమరావతిలో ఈ నెల 13న బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి ముఖ్యమంత్రి చంద్రబాబు భూమిపూజ చేయనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను బాలకృష్ణ, ఆయన సన్నిహితులు గాంధీ, సిద్ధాంతి నాగమల్లేశ్వరరావు శనివారం పరిశీలించారు. ఆస్పత్రి నిర్మాణ ప్లాన్‌లను సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్.. బాలకృష్ణకు వివరించారు. మొత్తం 21 ఎకరాల విస్తీర్ణంలో క్యాన్సర్ ఆస్పత్రి నిర్మిస్తున్నట్లు చెప్పారు. మూడు దశల్లో ఆస్పత్రి

...మిగతా 2లో

## వైకాపా ప్రభుత్వం బకాయిపెట్టిన రూ.1,674 కోట్లు చెల్లించాం

### మంత్రి పార్థసారథి



రేపల్లె: సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాతా సుఖీభవ ఎథకాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి పార్థసారథి తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ. 20వేలు అందిస్తామన్నారు. బాపట్ల జిల్లా రేపల్లె మార్కెట్ యార్డులో మరో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ కష్ణ ప్రసాద్‌తో కలిసి ఆయన 'అన్నదాతా సుఖీభవ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేపల్లె నియోజకవర్గంలో 28 వేల మంది రైతులకు రూ.15 కోట్లు అందిస్తున్నామన్నారు. ''గత ప్రభుత్వ హయాంలో ధాన్యం డబ్బుల కోసం రైతులు రోడ్డెక్కారు. కూటమి ప్రభుత్వం 48 గంటల్లోనే ధాన్యం డబ్బులు చెల్లిస్తోంది. గత వైకాపా

...మిగతా 2లో

### అత్యాచారం కేసు..

## ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు

రూ. పది లక్షల జరిమానా

ఎక్కెక్కి ఏడ్చిన దోషి..



## ట్రంప్ మాటల్లో నిజమే లేదు

- పదేపదే అబద్ధాలు చెప్తున్న ట్రంప్
- ఆయనది ఓర్వలేని తనం
- భారత ప్రభుత్వ వర్గాలు

2

## 70 కాదు కనీసం 80 గంటలు పనిచేయాలె

వారానికి 80 అనేవి కనీస స్థాయి పని గంటలు మాత్రమే

ఏఐ సంస్థ ఏప్రిల్ వ్యవస్థాపకురాలు నేహా సురేశ్ కామెంట్స్

వాదోపవాదాలకు దారి తీసిన ప్రతిపాదన



### పని గంటల పంచాతి

న్యూయార్క్, ఆగస్టు 2: పనిగంటలపై ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి చేసిన వ్యాఖ్యలపై నాటి నుంచి వివిధ స్థాయిల్లో దేశవ్యాప్తంగా చర్చలు జరుగుతోన్న విషయం పాఠకులకు విదితమే. ఇప్పుడు శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత యువ వ్యాపారవేత్త కూడా నారాయణమూర్తి వంటి

...మిగతా 2లో

## ఓటరు జాబితాలో నా పేరే లేదు

### వెల్లడించిన తేజస్వీ యాదవ్

### తోసిపుచ్చిన ఎన్నికల సంఘం



పాట్నా, ఆగస్టు 2: బిహార్ శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా ముసాయిదాను ఎన్నికల సంఘం శుక్రవారం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై విపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. తాజాగా ఆర్జేడీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ స్పందిస్తూ.. ఈ ముసాయిదా జాబితాలో తన పేరే లేదని

...మిగతా 2లో

## భారత ఆర్థికవ్యవస్థ డైనమిక్

### అది డెడ్ ఎకానమీ కాదు.. ట్రంప్ చెప్పింది తప్పు అంటున్న ఏఐ ప్లాట్‌ఫామ్‌లు

ఢిల్లీ, ఆగస్టు 2: ప్రస్తుత సాంకేతిక యుగంలో ఓపెన్ ఏఐ, చాట్ జీపీటీ వంటి వాటికి ప్రత్యేక ఆదరణ ఉంది. ఎలాంటి ప్రశ్నలకైనా ఈ కృత్రిమ మేధ ప్లాట్‌ఫామ్‌లు సమాధానం చెప్పగలవు. ఈ క్రమంలోనే భారత ఆర్థిక వ్యవస్థ పతనమైందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఇదే ప్రశ్నను పలు ఏఐ ప్లాట్‌ఫామ్‌లను అడగ్గా..

...మిగతా 2లో



# రైతలకు అందుబాటులో సాంకేతిక పరిజ్ఞానం





(మొదటి పేజీ తరువాయి)

విడతగా రూ.2 వేల చొప్పున రైతులకు సాయం అందిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఒక్కో రైతుకు రూ.7 వేలు చొప్పున జమ చేశాయి. ఒక్కో రైతు కుటుంబానికి కేంద్రం సాయంతో కలిపి ఏడాదికి రూ.20 వేలు అందించనున్నారు. ఇకపోతే గత ప్రభుత్వం వితంతు పింఛన్లు రద్దు చేసింది. మా ప్రభుత్వం రాగానే వితంతు పింఛన్లు మళ్లీ తీసుకొచ్చాం. లబ్ధిదారులు ఎక్కడుంటే .. అక్కడే పింఛన్ ఇస్తున్నాం. పింఛన్ల కోసం ఏడాదికి తెలంగాణ రూ.8వేల కోట్లు- ఖర్చు చేస్తుంటే.. ఏపీ రూ.32వేల కోట్లు- వెచ్చిస్తోంది. ఆగస్టు 15 నుంచి స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం. రాష్ట్రంలో ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. దీంతో దాదాపు రూ.2.62 కోట్ల మంది మహిళలు లబ్ధి పొందుతారని సీఎం వివరించారు. ఎన్నికల ముందు అరాచక, దుర్మార్గపు పాలన నడిచింది. 2019లో చేసిన తప్పిదం వల్ల ప్రజల భవిష్యత్ అంధకారంలోకి వెళ్లింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు- చీలకూడదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ మంచి ఉద్దేశంతో ముందుకొచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా జాతీయ పార్టీ భాజపాతో పొత్తు పెట్టుకున్నాం అనిచంద్రబాబు ఇవరించారు. ప్రజలకు హాని జరగకుండా ఉగ్రవాదులను మట్టుబెట్టాం. అభివృద్ధి చేయడం తెలిసిన పార్టీ తెదేపా అన్నారు. నిరంతరం ప్రజలతో మమేకమై పాలన సాగిస్తున్నామని అన్నారు. కేంద్రంలో భాజపా నాలుగోసారి కూడా అధికారం లోకి వస్తుందని, మోడీ పనితనమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా మోడీ హవా పెరుగుతోందన్నారు. మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బసవతారకం ఆస్పత్రికి 13న శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణం ఉంటుందన్నారు. ఇకపై తాను తీయబోయే సినిమాలలో సమాజానికి సంబంధించిన మంచి సందేశాలు ఉంటాయని బాలకృష్ణ తెలిపారు. హిందూపురంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు- చెప్పారు. భారీ ఎత్తున పరిశ్రమలు, అంతర్‌రాష్ట్ర రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు- చెప్పారు.మహిళా సాధికారత ఆధారంగా తీసిన 'భగవంత్ కేసరి' సినిమాకు జాతీయ అవార్డు రావడం సంతోషంగా ఉందని ప్రముఖ నటు-డు నందమూరి బాలకృష్ణ అన్నారు.

## జగన్‌కు కేజీకి, టన్నుకు తేడా తెలియదు

(మొదటి పేజీ తరువాయి)

దక్కుతుందని ఎద్దేవా చేశారు. శనివారం గజపతినగరం వ్యవసాయ మార్కెట్ యార్డులో 'అన్నదాతా సుఖీభవ-పీఎం కిసాన్' తొలి విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతుల విషయంలో రాజకీయం చేయరాదని హితవు పలికారు. రాజకీయం చేసేందుకు వైకాపా నాయకులు వ్యవసాయాన్ని అడ్డుపెట్టుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రైతు కుటుంబాలకు మేలు చేసే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తే.. ఉద్దేశపూర్వకంగానే అడ్డు తగులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం అంటే సీఎం చంద్రబాబుకు చాలా ఇష్టమని, రీ సర్వేలో రైతుల ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతన్నలు సాంకేతికతను వినియోగించుకోవాలని, ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలని ఆమె కోరారు. కార్యక్రమానికి ముందు గజపతినగరం రైల్వేస్టేషన్ దగ్గర పురిటిపెంట గ్రామంలో మంత్రి అనిత వరినాట్లు పరిశీలించి, రైతులతో కలిసి నాట్లు వేశారు.

## 20వ విడత కిసాన్ సమ్మాన్ నిధి విడుదల

### వారణాసి పర్యటనలో ప్రారంభించిన ప్రధాని మోడీ

**వారణాసి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారణాసి నుంచి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 20వ విడత మొత్తాన్ని విడుదల చేశారు. సేవాపురిలోని బనౌలిలో జరిగిన కార్యక్రమంలో ఈ విడతను అధికారికంగా విడుదల చేశారు. ఈసారి దేశవ్యాప్తంగా 9.7 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.20,000 కోట్లు బదిలీ అయ్యాయి. ఈ పథకం ద్వారా రైతులకు ఏడాదికి మూడు విడతల్లో రూ.6,000 ఆర్థిక సాయం అందుతుంది. అంటే, ఒక్కో విడతలో రూ.2,000 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ అవుతాయి. అంతకుముందు, జూన్ 18, 2024న, ప్రధానమంత్రి మోదీ నుంచి రూ.9.26 కోట్ల మంది రైతుల ఖాతాలకు సమ్మాన్ నిధిని రిలీజ్ చేశారు. వారణాసి పర్యటనలో భాగంగా మోదీ దాదాపు రూ.2,200 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతోపాటు- శంకుస్థాపన చేశారు. వీటిలో రోడ్లు, ఆసుపత్రులు, స్కూళ్లు సహా రకరకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయి.

## 70 కాదు కనీసం 80 గంటలు పనిచేయాలె

(మొదటి పేజీ తరువాయి)

వాదనే వినిపించారు. ఆమె ఏప్రిల్ అనే ఏఐ సంస్థ స్థాపకురాలు నేహా సురేశ్. తన సహ వ్యవస్థాపకుడు ఆకాశ్ పనిచేస్తోన్న వీడియోను ఆమె నెట్ లో షేర్ చేశారు. చిన్నపాటి ఆఫీసులో రెండువేర్వేరు డెస్కుల్లో ఆకాశ్, నేహా తమ రోజూవారీ పని ఎలా నడుస్తుందో ఆ వీడియోలో చూపించారు. వారు పూర్తిగా పనిలో నిమగ్నమై, మధ్యమధ్యలో చిన్న బ్రేకులు తీసుకోవడం కనిపించింది. ఈ దృశ్యాలతో పాటు ఆమె తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ''మీ కలను సాకారం చేసుకోవడానికి రోజుకు 14 గంటలు వెచ్చించకపోతే.. మీరు దానిని సాధించుకోలేరు. 9-5 పని గంటలతో మీరు ఈ ప్రపంచాన్ని మార్చే ఉత్పత్తిని తయారు చేయలేరు. వారానికి 80 గంటలు అనేది తీవ్రమైనది కాదు. అవి కనీస స్థాయి పనిగంటలు మాత్రమే'' అని నేహా చేసిన వ్యాఖ్యలపై తీవ్ర వాదోపవాదాలు జరుగుతున్నాయి. కొందరు ఆమె నిబద్ధతను మెచ్చుకున్నారు. మరికొందరు మాత్రం ఇలాంటి జీవనశైలి అందరికి సరిపోతుందా..?అని ప్రశ్నించారు. ప్రపంచాన్ని మార్చే ఉత్పత్తులను ఈ 9-5, 80 పని గంటలతో మాత్రమే కాకుండా ఇంకా ఇతర మార్గాల్లో కూడా రూపొందించవచ్చు'' అని కామెంట్ చేశారు. గతంలో నారాయణమూర్తి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్ లో ఉత్పాదకత తక్కువన్నారు. అందుకే దేశ యువత మరిన్ని గంటలు అధికంగా శ్రమించాలన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జపాన్, జర్మనీ వంటి దేశాలు ఎలాగైతే కష్టపడ్డాయో.. మనమూ అలా శ్రమించాలని అన్నారు.అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడాలంటే భారత్ లోని యువత వారానికి 70 గంటల పాటు పనిచేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే వారానికి 90 గంటల పాటు పనిచేయాలని, ఆదివారం సెలవునూ వదిలేయాలని ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యం చేసిన వ్యాఖ్యలు దుమారాన్ని లేపాయి. ''అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో లక్ష్యాలను చేరాలంటే అసాధారణ కృషి అవసరం. ఈ విస్తృత లక్ష్యాన్నే ఛైర్మన్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తున్నాయి'' అని అప్పట్లో సంస్థ వివరణ ఇచ్చి వివాదం సమసిపోవడానికి ప్రయత్నించింది.

ట్రంప్ కామెంట్లకు మోడీ కౌంటర్..

## మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న భారత్

- మనోళ్లు తయారు చేసిన వస్తువులనే కొనాలన్న ప్రధాని

**వారణాసి, ఆగస్టు 2:** భారత్ ఆర్థిక వ్యవస్థను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 'డెడ్ ఎకానమీ' అన్న వ్యాఖ్యలపై ప్రధాని మోడీ పరోక్షంగా స్పందించారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదిగే దిశగా భారత్ పరుగులు పెడుతోందని మోడీ తెలిపారు. అంతేకాదు.. ట్రంప్ టారిఫ్ల వేళ స్వదేశీ ఉత్పత్తులను పెంచాలంటూ పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ వారణాసిలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడారు. ''ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొంది. అన్ని దేశాలు తమ తమ సొంత ప్రయోజనాల పైనే ఎక్కువగా దృష్టిపెడుతున్నాయి. భారత్ కూడా అతిత్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా మారనుంది. అందువల్ల ఇప్పుడు మన ఆర్థిక ప్రయోజనాలపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది. రాజకీయ పార్టీలు కూడా విభేదాలను పక్కనబెట్టి 'స్వదేశీ' ఉత్పత్తుల విప్లవానికి నడుంబిగించాలి. కేవలం భారతీయులు తయారుచేసిన వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలి'' అని మోడీ పిలుపునిచ్చారు.

## కూటమి ఐక్యతను దెబ్బతీసే కుట్రలన్నింటినీ ఐక్యతతో ఛేదిద్దాం: పవన్ కల్యాణ్

**అమరావతి:** ఒక దేశ ప్రగతికి చిహ్నాలు రోడ్లు, రవాణా మార్గాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆనాడు వాజ్‌పేయి ముందుచూపుతో స్వర్ణచతుర్భుజి రహదారులు తెచ్చారని.. ఆయన వేసిన రోడ్ల వల్లే దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రూ.5 వేల కోట్ల విలువైన జాతీయ రహదారులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పలువురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ''ఇవాళ ఏపీలో రూ.5వేల కోట్లతో 29 హైవే ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసుకున్నాం. ఎన్డీయే వచ్చాక దేశంలో కీలకమైన ప్రాజెక్టులు చేపట్టింది. ఇవాళ హైవేల నిర్మాణ వేగం మూడురెట్లు పెరిగింది. అడవితల్లి బాట పేరుతో గిరిజన ప్రాంతాల్లోనూ రోడ్లను నిర్మిస్తున్నారు. 78 ఏళ్లుగా రోడ్లు లేని గిరిజన ప్రాంతాలకు ఇప్పుడు రోడ్లు వేస్తున్నారు. డోలీ మోతలు లేకుండా చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుంబిగించాయి. మెరుగైన రోడ్లపైనే రాష్ట్ర ఆర్థిక ప్రగతి ఆధారపడి ఉంటుంది.

## దేశ ప్రగతికి చిహ్నాలు రోడ్లు, రవాణా మార్గాలే

- ఏపీలో రూ.5వేల కోట్లతో 29 హైవే ప్రాజెక్టులకు శంకుస్థాపనలు
- ఏపీ డిప్యూటీ-సీఎం పవన్ కల్యాణ్ వెల్లడి

**అమరావతి:** ఒక దేశ ప్రగతికి చిహ్నాలు రోడ్లు, రవాణా మార్గాలని ఏపీ డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆనాడు వాజ్‌పేయి ముందుచూపుతో స్వర్ణచతుర్భుజి రహదారులు తెచ్చారని.. ఆయన వేసిన రోడ్ల వల్లే దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రూ.5 వేల కోట్ల విలువైన జాతీయ రహదారులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పలువురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఇవాళ ఏపీలో రూ.5వేల కోట్లతో 29 హైవే ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసుకున్నాం. ఎన్డీయే వచ్చాక దేశంలో కీలకమైన ప్రాజెక్టులు చేపట్టింది. ఇవాళ హైవేల నిర్మాణ వేగం మూడురెట్లు- పెరిగింది. అడవితల్లి బాట పేరుతో గిరిజన ప్రాంతాల్లోనూ రోడ్లను నిర్మిస్తున్నారు. 78 ఏళ్లుగా రోడ్లు లేని గిరిజన ప్రాంతాలకు ఇప్పుడు రోడ్లు వేస్తున్నారు. డోలీ మోతలు

లేకుండా చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుంబిగించాయి. మెరుగైన రోడ్లపైనే రాష్ట్ర ఆర్థిక ప్రగతి ఆధారపడి ఉంటుంది. కూల్చితవేల ప్రభుత్వం, రోడ్లు వేయని ప్రభుత్వాన్ని చూశాం. మరో 15 ఏళ్ల పాటు- కూటమి ప్రభుత్వం బలంగా ఉండాలని అన్నారు. కూల్చివేతలతో గత ప్రభుత్వం మొదలైతే.. ప్రతీ గ్రామంలో కూటమి ప్రభుత్వం గుంతలు పూడ్చి కొత్త రహదారులు నిర్మిస్తోంది. కూటమి ఐక్యతను దెబ్బతీసే కుట్రలన్నింటినీ ఐక్యతతో ఛేదిద్దాం. కూటమి నాయకుల మధ్య చిన్న చిన్న పొరపొచ్చాలు వచ్చినా.. పరిష్కరించుకుని కలిసికట్టు-గా ముందుకు సాగుదాం. అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలి. ఇవాళ దేశ ప్రగతికి, పురోగతికి సంబంధించిన కార్యక్రమానికి ఏపీ వేదికైంది. సుస్థిర ఆర్థికాభివృద్ధితో దేశం ముందుకెళ్తోంది. వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు ప్రధాన ఆయుధం మౌలిక వసతుల కల్పన. హైవే మాన్ ఆఫ్ ఇండియాగా గడ్కరీ జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తున్నారు.

## ఆమె ఓ మెషీన్‌గన్

- వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీపై ట్రంప్ ప్రశంసలు

**వాషింగ్టన్, ఆగస్టు 2:** వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసలు కురిపించారు. న్యూస్‌మాక్స్‌లో రాబ్ ఫిన్నెర్టీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. అమెరికాకు అధ్యక్షుడిగా సేవలు అందించిన అందరు అధ్యక్షుల్లో తనకు మాత్రమే అద్భుతమైన, ఉత్తమ ప్రెస్ సెక్రటరీ ఉందని అన్నారు. కరోలిన్ లీవిట్ మెషీన్‌గన్‌లా పనిచేస్తూ.. తన విధులను సమర్థమంతంగా నిర్వర్తిస్తోందన్నారు. అందం, హుందాతనంతో ప్రజల్లో ఓ స్టార్‌గా మారిపోయిందని పేర్కొన్నారు. కరోలిన్ మాట్లాడేటప్పుడు ఆమె పెదాల కదలిక చాలా అందంగా ఉంటుందని పొగిడారు. అదే ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామాపై ట్రంప్ విమర్శలు గుప్పించారు. 2016 ఎన్నికల్లో తాను విజయం సాధించిన తర్వాత తన పాలనను నియంత్రించేందుకు ఒబామా సన్నిహిత వర్గాలు అసత్య ప్రచారం చేశాయని మండిపడ్డారు. ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందంటూ తప్పుడు వాదన తెచ్చారని ఆరోపించారు. దీనికి ఆయన తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. మరో వైపు కరోలిన్ లీవిట్ కూడా అమెరికా అధ్యక్షుడిపై ప్రశంసలు గుప్పించారు. ట్రంప్ ప్రపంచంలోనే అత్యంత ప్రభావవంతమైన నేత అని కొనియాడారు. ఆయన భారత్- పాక్ మధ్య జరిగిన ఘర్షణతో సహా ప్రపంచవ్యాప్తంగా థాయ్‌లాండ్-కంబోడియా, ఇజ్రాయెల్-ఇరాన్, ఈజిప్ట్- ఇథియోపియా, రువాండా- కాంగో డెమోక్రాటిక్ రిపబ్లిక్ వంటి అనేక యుద్ధాలను ముగించారన్నారు. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్ హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపడానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇందుకుగాను ఆయనకు నోబెల్ శాంతి పురస్కారాన్ని అందించాలని కోరారు. గత కొంతకాలంగా ట్రంప్ నోబెల్ శాంతి బహుమతి తనకు వస్తుందని ఆశగా ఉన్నారు. నోబెల్ శాంతి బహుమతికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేరును ఇజ్రాయెల్, పాకిస్థాన్ ప్రతిపాదించాయి. తాను ఎన్ని యుద్ధాలు ఆపినా తనకు నోబెల్ శాంతి బహుమతి రాదేమోనని ఆయన పలుమార్లు నైరాశ్యం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో కరోలిన్ లీవిట్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## 16 నుంచి 'అమృత్ ఉద్యాన్' సందర్శన

**ఢిల్లీ, ఆగస్టు 2:** రాష్ట్రపతి భవన్‌లోని అమృత్ ఉద్యాన్ (మొఘల్ గార్డెన్స్)ను ప్రజల సందర్శనార్థం ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 14 వరకు ప్రవేశం కల్పిస్తున్నట్లు రాష్ట్రపతి భవన్ అధికారిక వర్గాలు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించాయి. ఉద్యానవనంలో ప్రవేశానికి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సందర్శకులకు అనుమతి ఇవ్వనున్నారు. నిర్వహణ నిమిత్తం అన్ని సోమవారాలు సెలవు ఉంటుందని రాష్ట్రపతి కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉద్యానవనంలో బాలవాటిక, హెర్బల్ గార్డెన్ , బోన్సాయ్ గార్డెన్ ,సెంట్రల్ లాన్, సర్క్యులర్ గార్డెన్, లాంగ్ గార్డెన్ వంటివి సందర్శకులను ఆకర్షించనున్నాయి. అమృత్ ఉద్యాన్ లోని ప్రతి మొక్కకు ఉన్న క్యూఆర్ కోడ్ సహాయంతో ఆ వృక్ష జాతి గురించి తెలుకోవచ్చు. ఆగస్టు 29న జాతీయ క్రీడల దినోత్సవం, సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడాకారులకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక ప్రవేశ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## 46,85,838 మంది రైతులకు లబ్ధి

(మొదటి పేజీ తరువాయి)

రూ.5,000 చొప్పున జమ చేశాం. దీనికోసం రూ.2,343 కోట్ల నిధుల్ని కేటాయించాము. మొదటి విడతలో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.2,000 చొప్పున రూ.832 కోట్లు ఇస్తోంది. మొదటి విడతలో కేంద్రం- రాష్ట్ర వాటాలు కలిపి ఒక్కో రైతుకు రూ.7,000 జమ చేశాం. ఈ విడతలో రైతులకు రూ.3,175 కోట్ల మేర లబ్ది కలుగుతోందని అన్నారు. పథకం అమలుకు సంబంధించి రైతులకు ఎలాంటి ఫిర్యాదులు, సందేహాలు ఉన్నా అన్నదాత సుఖీభవ పోర్టల్‌లోని ఆర్‌ఎస్ కే లాగిన్ ద్వారా తెలుసుకోవచ్చని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అలాగే 155251 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు. రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఏ పంట వేస్తే లాభాలు వస్తాయన్నది అధ్యయనం చేసి వారికి సూచనలు జారీ చేస్తామని వెల్లడించారు. సూపర్ సిక్స్‌లో ప్రధాన హామీ అన్నదాత సుఖీభవ -పీఎం కిసాన్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రకాశం జిల్లా, దర్శి మండలం, వీరాయపాలెంలో ప్రారంభించారు. పచ్చని పొలాల్లో రైతుల మధ్య కూర్చుని ఈ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. కర్షక సోదరులతో కలిసి పథకాన్ని ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 46,85,838 మంది రైతుల ఖాతాల్లో రూ.7వేలు జమచేశారు. అనంతరం ముఖ్యమంత్రి రైతులతో కాసేపు ముచ్చటిం చారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో గత ప్రభుత్వానికి...కూటమి ప్రభుత్వానికి గల వ్యత్యాసం ఎంత మేర ఉందో చూడాలని సీఎం అన్నారు. ఎన్నికల్లో చేసిన ప్రకటన మేరకు రైతులకు ఏటా రూ.20,000 వేలు ఇస్తామన్న హామీని నెరవేర్చామన్నారు. ఈ పథకం ద్వారా 3 విడతల్లో రైతులకు ఈ పథకాన్ని వర్తింప చేస్తామని సీఎం స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ఇలా పచ్చని పొలాలు, దేశానికి అన్నం పెట్టే రైతుల మధ్య ప్రారంభించడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. 'రైతు కళ్లల్లో ఆనందాన్ని నేరుగా చూస్తున్నాను. రైతు ఎప్పటికీ రాజే. కరోనా వంటి విపత్తులోనూ అన్నదాత నాగలి చేతపట్టి పొలంలో పనిచేశాడు. ఎన్ని కష్టాలున్నా రైతులు బాగుండాలనేది నా కోరిక. ఎన్నికలకు ముందు విధ్వంస, సైకో పాలనతో అందర్నీ ఇబ్బంది పెట్టి వారు ఆనందపడ్డారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టే సూపర్ సిక్స్ అమలు నాకు మాటల్లో చెప్పలేని సంతోషాన్నిస్తోంది. అన్నదాత సుఖీభవ కింద ప్రకాశం జిల్లాకు రూ.186 కోట్లు- ఇస్తున్నాం. జిల్లాలోని 2,65,317 లక్షల మంది రైతులకు ఈ పథకం ద్వారా లబ్ధి కలుగుతోంది. అలాగే దర్శి నియోజకవర్గంలో 42,786 మంది రైతులకు రూ.29 కోట్లు- ఇస్తున్నాం. దర్శి మండలంలో 10,972 మంది రైతులకు రూ.7.36 కోట్లు- ఇస్తున్నాం. ఒక్క వీరాయపాలెంలోనే 476 మంది రైతులకు రూ.31,00,000 లక్షలు ఇస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా టీ-డీపీ, బీజేపీ, జనసేన పొత్తు పెట్టు-కుని ఎన్నికలకు వెళ్లాం. ప్రజలు బ్రహ్మాండమైన మెజారిటీ-తో గెలిపించారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం చేసింది. చాలా సమస్యలు వచ్చాయి. ఎన్ని కష్టాలున్నా, ఇచ్చినమాట నిలబెట్టు-కోవాలని సూపర్ సిక్స్ అమలు చేస్తున్నాం. నేను హామీ ఇచ్చినట్టే పెంచిన రూ. 4000 పింఛను గత ఏడాది ఏప్రిల్ నుంచే ఇచ్చాను. పింఛన్ల కోసం ఏడాదికి 64 లక్షల మందికి రూ. 32,134 కోట్లు- ఖర్చు చేస్తున్నాం. గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.1000 మాత్రమే పెంచింది. భర్త చనిపోతే భార్యకు వితంతు పెన్షన్ ఎగ్గొట్టారు. ఎవరైనా లబ్దిదారులు రెండు నెలలు పింఛను తీసుకోక పోయినా మూడు నెలల మొత్తాన్ని ఒకేసారి ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

## వైకాపా ప్రభుత్వం బకాయిపెట్టిన రూ.1,674 కోట్లు చెల్లించాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం బకాయిపెట్టిన రూ.1,674 కోట్లు కూడా చెల్లించాం. ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం'' అని పార్థసారథి వివరించారు.

**అప్పుల బాధ నుంచి ఉపశమనం పొందేందుకే: మంత్రి శుభాష్** మరోవైపు రైతులు అప్పుల బాధ నుంచి ఉపశమనం పొందేందుకే అన్నదాతా సుఖీభవ పథకాన్ని తీసుకొచ్చినట్లు మంత్రి శుభాష్ వివరించారు. కష్ణా జిల్లా కంకిపాడు మార్కెట్ యార్డులో నిర్వహించిన అన్నదాతా సుఖీభవ మొదటి విడత కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రైతే రాజు అనే నినాదాన్ని కూటమి ప్రభుత్వం ఈ పథకం ద్వారా బలపరుస్తుందన్నారు.

## ఓటరు జాబితాలో నా పేరే లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. పాట్నాలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

''నా ఈపీఐసీ నంబరుతో ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో చెక్ చేశా. ఈ ముసాయిదా జాబితాలో నా పేరు కన్పించలేదు. ఇక నేను ఎన్నికల్లో ఎలా పోటీ చేయాలి? స్వయంగా బూత్ లెవల్ అధికారి నావద్దకు వచ్చి ఫామ్ తీసుకెళ్లారు. అయినా నా పేరు జాబితాలో లేదు'' అని తేజస్వీ వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అనంతరం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి దాదాపు 20వేల నుంచి 30వేల వరకు ఓటర్లను తొలగించారని ఆర్జేడీ నేత ఆరోపించారు. మొత్తంగా రాష్ట్రంలో దాదాపు 65 లక్షల ఓటర్లను తొలగించారని పేర్కొన్నారు.

అయితే, తేజస్వీయాదవ్ చేసిన ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. ముసాయిదా జాబితాలో ఆయన పేరు ఉందని పేర్కొంది. అందుకు సంబంధించిన కాపీని కూడా విడుదల చేసింది. ఆర్జేడీ నేత బహుశా తన పాత ఈపీఐసీ నంబరుతో చెక్ చేసుకుని ఉంటారని, అందుకే ఆయన పేరు జాబితాలో కన్పించకపోయి ఉండొచ్చని ఈసీ తెలిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పూర్తవటంతో ఈసీ ఈ ముసాయిదా జాబితాను రూపొందించింది. జాబితా నుంచి 65 లక్షల మందిని తొలగించడంతో ఓటర్ల సంఖ్య 7.93 కోట్ల నుంచి 7.28 కోట్లకు తగ్గింది. దీనిపై అభ్యంతరాలు తెలిపేందుకు సెప్టెంబరు 1 వరకు ఈసీ గడువు కల్పించింది.

## ట్రంప్ మాటల్లో నిజమే లేదు

**ఢిల్లీ, ఆగస్టు 2:** రష్యా నుంచి చమురు దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓర్వలేనితనాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తన స్పష్టమైన వైఖరిని వెల్లడించినప్పటికీ.. రష్యా చమురును భారత్ కొనుగోలు చేయదని ట్రంప్ మరోసారి వ్యాఖ్యలు చేశారు. వీటికి కూడా కౌంటర్ వచ్చింది.''ఇకపై రష్యా ఆయిల్‌ను భారత ప్రభుత్వం కొనుగోలు చేయదన్న విషయం నావరకు వచ్చింది. అది నిజమా..?కాదా..? అనేది నాకు తెలియదు. అది మంచి నిర్ణయమే అయితే ఏం జరుగుతుందో చూద్దాం'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. దీనిపై ప్రభుత్వ వర్గాల నుంచి దీటైన స్పందన వచ్చింది. ''భారత చమురు సంస్థలు రష్యా సరఫరాదారుల నుంచి కొనుగోళ్లు కొనసాగిస్తున్నాయి. ధర, రవాణా, ఇతర ఆర్థిక అంశాల ఆధారాలు ఇక్కడ కీలకంగా ఉంటాయి. భారత్ 85 శాతం ఇంధనం దిగుమతి చేసుకుంటోంది. సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో మూడో అతిపెద్ద వినియోదారుగా ఉన్న భారత్.. అంతర్జాతీయ నిబంధనలకు పూర్తిగా కట్టుబడి.. అందుబాటు ధరల్లో లభ్యమయ్యే చమురు కొనుగోలును కొనసాగిస్తుంది. దేశ ఇంధన నిర్ణయాలు జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటాయి. అదే సమయంలో ఆ కొనుగోళ్లు అంతర్జాతీయ ఇంధన స్థిరత్వానికి, సమతుల్యతకు కూడా సానుకూలంగా దోహదం చేస్తున్నాయి'' అని స్పష్టం చేశాయి. రష్యా నుంచి భారత్ చమురు కొనడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసిన ట్రంప్ ఆ రెండు దేశాలవి పతనమైన ఆర్థిక వ్యవస్థలని విమర్శించారు. మరోవైపు భారత్ చమురు కొనడం వల్లే ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని కొనసాగించగలుగుతోందని అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియో పేర్కొన్నారు. ఆంక్షల వల్ల అక్కడ చమురు చౌకగా లభిస్తోందని, దురదృష్టవశాత్తూ అదే యుద్ధంలో రష్యా మనుగడకు ఉపయోగపడుతోందన్నారు. దీనిపై ఇప్పటికే భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ స్పందిస్తూ.. రష్యా నుంచి చమురు కొనుగోలుకు కట్టుబడి ఉన్నామన్నారు.

## ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు

**బెంగళూరు, ఆగస్టు 2:** ఇంట్లో పనిమనిషిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన కేసులో హాసన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు పడింది. దీంతోపాటు రూ.10లక్షల జరిమానా విధిస్తూ బెంగళూరులోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం శిక్ష ఖరారు చేసింది. బాధితురాలికి రూ.7లక్షలపరిహారం ఇవ్వాలని ఆదేశించింది. ఇటీవల విచారణను పూర్తి చేసిన న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే.. రేవణ్ణను దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. అంతకుముందు ఇదే కేసులో తనకు తక్కువ శిక్ష వేయాలంటూ న్యాయమూర్తిని మాజీ ఎంపీ వేడుకున్నాడు. ఆ సమయంలో అతడు బిగ్గరగా ఏడ్చాడు. ఆగస్టు 1న తీర్పు ప్రకటించిన తర్వాత కూడా ప్రజ్వల్ కన్నీరుమున్నీరుగా విలపించాడు. న్యాయస్థానం నుంచి బయటకు వచ్చిన అనంతరమూ వెక్కివెక్కి ఏడ్చాడు. కేఆర్ నగరకు చెందిన మహిళ 2024 ఏప్రిల్ 28న హొళెనరసీపుర ఠాణాలో ప్రజ్వల్ రేవణ్ణపై ఫిర్యాదు చేయడంతో ఆయనపై అత్యాచారం కేసు నమోదు చేసింది. గన్నిగడ ఫాంహౌస్‌లో తనపై అత్యాచారం జరిగిందని బాధితురాలు (47) తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం మరికొన్ని అత్యాచార కేసులు ప్రజ్వల్‌పై నమోదయ్యాయి. ఈ కేసు విచారణలో భాగంగా 14 నెలలుగా ప్రజ్వల్ కారాగారంలో విచారణ ఖైదీగా ఉండగా తాజాగా జీవిత ఖైదు శిక్ష ఖరారైంది.

# తిరుమల శ్రీవారి లడ్డూకు 310 ఏళ్లు

**తిరుమల, ఆగస్ట్ 2(మనం న్యూస్):** తిరుమల అంటే శ్రీవారి లడ్డు లడ్డు అంటే తిరుమల ఇంతటి ప్రాశస్యమ ఉన్న శ్రీవారి లడ్డుకి 310 సంవత్సరాలు పూర్తయింది.తిరుమల దర్శనానికి ఎవరు వెళ్లినా లడ్డూను రుచి చూడకుండా ఉండలేరు. కొందరు వెళ్లకపోయినా తెప్పించుకుని కళ్లకు అద్దుకుని తింటారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశ విదేశాల్లో తిరుమల లడ్డూకు ఎనలేని ఆదరణ ఉంది. అలాంటి శ్రీవారి లడ్డూ ఇవాళ్టితో (శనివారం ఆగస్టు 02) 310 ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. 310 ఏళ్ల చరిత్ర ఉన్న తిరుమల ప్రసాదానికి ఉన్న విశిష్టత.. ఒక్క రోజుతో వచ్చిన ఆదరణ కాదు. ఎన్నో ఏళ్లుగా ఎంతో మార్పులు చేస్తూ భక్తులకు మరింత నాణ్యతతో రుచి, శుచి, శుభ్రతతో తయారు చేసి ప్రపంచంలోనే నం.1 ప్రసాదంగా చరిత్రకెక్కింది. ప్రసాదంగా లడ్డూను ఇవ్వడం 1715 ఆగస్టు 2 వ తేదీన ప్రారంభించారు. 2010 వరకూ దాదాపు రోజుకు లక్షల లడ్డూలను టీటీడీ తయారు చేసేది. భక్తుల అధిక రద్దీ కారణంగా ప్రతి నిత్యం దాదాపు మూడు లక్షల ఇరవై వేల లడ్డూలను టీటీడీ తయారు చేస్తోంది. 15 శతాబ్దం లో భక్తులకి వడ ప్రసాదం మాత్రమే అందించేవారు అర్చకులు. ఆ తర్వాత17 వ శతాబ్దం నుంచి బుంది లడ్డూను అందించారు. ఆ తరువాత లడ్డూలు తయారు చేసినవారు హాథీరాంజీ మఠం నిర్వహకులు. 1715 ఆగస్టు 2న శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారు చేసినట్లు చెబుతుంటే, క్రీ.శ.1803లో బూందీగా పరిచయమైన





అటుతరువాత 1940 నాటికి లడ్డూ ప్రసాదంగా స్థిర పడినట్లు కొందరు పండితులు భావిస్తారు. మొదట్లో లడ్డూ ప్రసాదంను ఎనిమిది నాణేలకే ఇచ్చేవారని, అటుతరువాత 2, 5, 10, 15, 25 నుంచి ప్రస్తుతం రూ.50లకు టిటిడి విక్రయిస్తోంది. 1940వ సంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకుంటే మాత్రం లడ్డూ వయస్సు 83 సంవత్సరాలు అవుతుందని కొందరు చెబుతారు. ఇంతటి విశిష్టత, ప్రాధాన్యత కలిగిన తిరుపతి లడ్డూకు పేటెంట్, ట్రేడ్ మార్క్ కూడా ఉన్నాయి. 2014లో తిరుపతి లడ్డూకు జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ గుర్తింపు కూడా లభించింది. ఆ విధంగా తరాలు మారుతున్నా తరగని రుచితో.. హిందువుల మనసులో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. శ్రీవారి లడ్డూకు ఉన్న ప్రత్యేకతను క్యాష్ చేసుకునేందుకు చాలా మంది ప్రయత్నించారు. డూప్లికేట్ తయారు చేసి ఆన్ లైన్‌లో విక్రయించేందుకు ఎన్నో సంస్థలు ప్రయత్నించాయి. కానీ తిరుమల లడ్డూతో సరిసమానంగా నిలవలేకపోయాయి. ఆన్ లైన్ లో లడ్డూలను విక్రయించే సంస్థలన్నింటికీ టీటీడీ నోటీసులు జారీ చేసి కేసులు నమోదు చేసింది.



## దేశం సుసంపన్నంగా ఉండాలి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ
- శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి

**తిరుచానూరు, ఆగస్టు 2(మనం న్యూస్):** కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ శనివారం కుటుంబ సమేతంగా తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ, దేశం సుసంపన్నంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు కేంద్రమంత్రి శ్రీ నితిన్ గడ్కరీ తెలిపారు. ముందుగా ఆలయం వద్ద రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి, టీటీడీ ఈవో జె.శ్యామల రావు, జేఈవో వి.వీరబ్రహ్మం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి స్వాగతం పలికారు. ఆలయంలోకి చేరుకున్నాక ధ్వజస్తంభానికి మొక్కులు చెల్లించారు. అనంతరం, ఆయన దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి వేద పండితులు వేద ఆశీర్వచనాలతో మంత్రి దంపతులను ఆశీర్వదించారు. అనంతరం, ఆశీర్వాద మండపంలో కేంద్ర మంత్రికి టిటిడి ఈవో జె. శ్యామలరావు అమ్మవారి ప్రసాదాలు, వస్త్రాలను కేంద్ర మంత్రికి అందచేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు మెంబర్ జి.భాను ప్రకాష్ రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, అర్చకులు బాబు స్వామి, ఏఈవో దేవరాజులు ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల భద్రతపై సన్నాహక సమావేశం



**తిరుమల, ఆగస్ట్ 2(మనం న్యూస్):** ఈ ఏడాది సెప్టెంబర్ 24 నుండి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ విజిలెన్స్, ఫైర్, ఎస్పీఎఫ్ అధికారులతో తిరుమలలోని అన్నమయ్య భవన్ లో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా తిరుమలలోని ప్రతి ప్రాంతంపై నిఘా ఉంచుతూ టెక్నాలజీని వినియోగించి భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు సీఎం పట్టు వస్త్రాల సమర్పణ నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్య రోజులైన పెద్దశేష వాహనం, గరుడ వాహనం, రథోత్సవం, చక్రస్నానం రోజుల్లో భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వాహన సేవలను తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా గ్యాలరీలు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ప్రణాళికాబద్ధంగా రూపొందించాలని చెప్పారు. బ్రహ్మోత్సవ రోజుల్లో వాహన రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక పార్కింగ్ లు ఏర్పాటు చేయాలని సంబంధిత విజిలెన్స్, సెక్యూరిటీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో టీటీడీ వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి గడ్కరి



**తిరుమల, ఆగస్టు 02(మనం న్యూస్):** తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం వి ఐ పీ విరామ సమయంలో కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయక మండపంలో అర్చకులు వేద ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమం తో టీటీడీ ఏఈఓ వెంకయ్య చౌదరి, టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు ఉన్నారు.

## రైతుకు దన్నుగా కూటమి ప్రభుత్వం

- అన్నదాత సుఖీభవా... పథకానికి శ్రీకారం
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఏపీ సీఎం
- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

**చిత్తూరు, ఆగస్టు 2(మనం న్యూస్):** 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.., అధికారంలో కొచ్చిన కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవా పథకాన్ని అమలుపరచి అన్నదాతకు దన్నుగా నిలిచిందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు... ఏ.పీ సర్కార్ కృషిని ఓ ప్రకటనలో కొనియాడారు. ఢిల్లీ పార్లమెంటు సమావేశాలకు హాజరైన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ, శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవా -పీ.యం కిసాన్ పథకాన్ని ప్రారంభించడం పై హర్ష వ్యక్తం చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



అన్నదాత సుఖీభవ-పి.యం.కిసాన్ పథకానికి శ్రీకారం చుట్టి, రైతన్నల విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని నిరూపించారని తెలిపారు. ఇది మా ప్రభుత్వ దార్శినికతకు నిదర్శనమన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా, పెట్టుబడి నిధి కింద ఏటా మూడు విడతలుగా రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందించి, రైతులను ఆదుకునే దిశగా ఏపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రైతన్నల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, రాష్ట్రంలోని సుమారు 46,86 లక్ష మంది అన్నదాతలకు 3,174,43 కోట్ల రూపాయలను జమ చేయడం హర్షనీయమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించి, రైతన్నల దన్నుగా నిలిచారని కొనియాడారు. మామిడి రైతుల విషయంలోనూ ఏపీ సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలు.., సత్ఫలితాలు ఇచ్చాయని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ, రైతన్నల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని కోరి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను టిడిపి, బిజెపి, జనసేన పార్టీ నాయకులు ఐక్యమత్యంగా ప్రజలకు చేరువ చేయాలని, వారి జీవితాలలో వెలుగులు నింపాలని పిలుపునిచ్చారు.

## అసత్య వార్తలు మీడియాలో రావడం బాధాకరం



- నిజానికి ఆర్చిపైన ఉన్నవి గంధర్వులు పుష్పమాలతో ఉన్న శిల్పాలు

**తిరుపతి, ఆగస్టు 2(మనం న్యూస్):** తిరుపతి అలిపిరిలోని టోల్గేట్ ఆర్చిపై 'అన్యమత బొమ్మలు' ఉన్నాయని కొన్ని మీడియా సంస్థలు ప్రచారం చేయడం శోచనీయం. ఈ టోల్గేట్ను ఏళ్ల క్రితమే టీటీడీ నిర్మించింది.

ఈ ఆర్చ్ను, సనాతన హైందవ ధర్మాన్ని ప్రతిబింబించే శిల్పాల రూపంలో, ఎస్వీ శిల్పకళాశాల నిపుణుల సూచనలతో తీర్చిదిద్దారు. ఆ శిల్పాలలో కనిపిస్తున్నవి గంధర్వులు పుష్పమాలతో ఉన్న చిత్రాలు మాత్రమే. అయితే, అవి అన్యమత శిల్పాలుగా చిత్రీకరించి, అవాస్తవపు వార్తలు ప్రచురించడం, ప్రసారం చేయడం పూర్తిగా నిరాధారమైనదే కాకుండా భక్తుల మనోభావాలను గాయపరచే చర్య. ఈ తరహా దుష్ప్రచారాన్ని టీటీడీ తీవ్రంగా ఖండిస్తోంది. అసత్య కథనాలను ప్రచురించినా లేదా ప్రసారం చేసినా సదరు వ్యక్తులు, సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ హెచ్చరిస్తోంది.

## పవిత్రోత్సవాలకు తిరుమల సర్వం సిద్ధం

- దోషాల ప్రాయశ్చిత్తం కోసం పవిత్రోత్సవం

**తిరుమల, ఆగస్ట్ 2(మనం న్యూస్):** అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు కొలువైన తిరుమల మరో ఉత్సవానికి సిద్ధమయ్యింది. స్వామివారికి జరిగే నిత్యపూజలు, ఉత్సవాలలోనూ భక్తుల వల్లగాని, అధికారులు, అర్చకుల వల్లగాని ఏదైనా లోపాలు జరిగిఉండే అవకాశం ఉంటుంది. ఇలా తెలిసీ తెలియక జరిగిన దోషాలకు ప్రాయశ్చిత్తం కోసం జరిపే ఉత్సవమే పవిత్రోత్సవం. ఈనెల 4 నుంచి తిరుమల శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు వేడుకగా జరగనున్నాయి. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు టిటిడి చేపట్టింది. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామి వెలసిన దివ్యక్షేత్రం తిరుమల, నిత్యకల్యాణం పచ్చతోరణం అన్నవిధంగా ప్రతి నిత్యం ఏదో ఒక ఉత్సవం జరుగుతూ ఉంటుంది. స్వామివారికి ఏడాది పొడవునా 450కి పైగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు వివిధ పురాణాలు తెలుపుతున్నాయి. తిరుమల శ్రీవారు ఎంతటి నైవేద్య ప్రియుడో అంతటి అలంకార ప్రియుడు కూడా. ఈ నేపథ్యంలో తిరుమల శ్రీవారి ఆలయం



మరో ఉత్సవానికి సిద్ధమయింది. ఆగస్టు 5 నుంచి 7వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఆగస్టు 4న అంకురార్పణంతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్లగానీ తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు ఆలయంలోని సంపంగి ప్రాకారంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ఆభరణాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఆగస్టు 5న పవిత్రాల ప్రతిష్ట, ఆగస్టు 6న పవిత్ర సమర్పణ, ఆగస్టు 7న పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. చారిత్రకంగా చూస్తే ఈ పవిత్రోత్సవాలు 15వ శతాబ్దంలో అమల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక 1962వ సంవత్సరం నుంచి టిటిడి ఈ ఉత్సవాలను పునరుద్ధరించింది. పవిత్రోత్సవాల్లో భాగంగా ఆగస్టు 4న అంకురార్పణ కారణంగా సహస్రదీపాలంకార సేవను టిటిడి రద్దు చేసింది. అదేవిధంగా, ఆగస్టు 5 నుండి 7వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దు చేసింది టిటిడి. తిరుమల శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు ఆలయ పవిత్రతను కాపాడటానికి, ఏడాది పొడవునా జరిగే అర్చనలు, ఉత్సవాలలో యాత్రికుల లేదా సిబ్బంది వల్ల తెలియకుండా జరిగే దోషాలను నివారించడానికి వార్షిక ఉత్సవాలు నిర్వహిస్తారని శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు తెలిపారు.

## దృఢ సంకల్పానికి మరో పేరు మోహన్ బాబు వర్సిటీ

- ఘనంగా మోహన్ బాబు విశ్వవిద్యాలయం రెండో కాన్వకేషన్ డే

**చంద్రగిరి, ఆగస్టు 2(మనం న్యూస్):** విద్యార్థులలో దృఢ సంకల్పం, పట్టుదల, సాంకేతిక విజ్ఞానాభివృద్ధి, మానవ సేవకు మరో పేరు మోహన బాబు విశ్వవిద్యాలయం అని రాజ్యసభ సభ్యులు ప్రఫుల్ పటేల్ అన్నారు.చంద్రగిరి మండలం ఏ రంగంపేట సమీపంలోని సాయినాథ్ నగర్ లో ఉన్న మోహన్ బాబు విశ్వవిద్యాలయం 2వ కాన్వకేషన్ డే, శ్రీ విద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాల 14 వ గ్రాడ్యుయేషన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి ప్రఫుల్ పటేల్ పాల్గొన్నారు. మరో ముఖ్య అతిథిగా ప్రముఖ రచయిత హిందీ అకాడమీ చైర్మన్ ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ మాజీ రాజ్యసభ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ హాజరయ్యారు.అతిధులకు యంబియు ఛాన్సలర్ డాక్టర్ మోహన్ బాబు, ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నాగరాజ రామారావు,ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్



మహేశ్వరి, రిజిస్ట్రార డాక్టర్ సారథి ఘనంగా స్వాగతం పలికారు. ఎన్సిసి విద్యార్థులు బ్యాండ్ మేళంతో అతిధులను సభా వేదిక వద్దకు తీసుకుని వెళ్లారు.జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రఫుల్ పటేల్ మాట్లాడుతూ మోహన్ బాబు విలక్షణమైన సినీ నటుడే కాక ఓ గొప్ప విద్యాసంస్థల అధినేతగా పేరు గడిచారని చెప్పారు. మంచు విష్ణు కు సరి అయిన పోటీ దారు మంచు మోహన్ బాబు అని చెప్పి అందరిని నవ్వించారు. విద్యను వ్యాపార ధ్వనిలో కాక సేవాభావంతో పేద విద్యార్థులకు కూడా చదువుకునే అవకాశం కల్పించడం మోహన బాబు విశ్వవిద్యాలయం ప్రత్యేకతగా చెప్పవచ్చన్నారు. యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయంగా మోహన్ బాబు విశ్వవిద్యాలయం పేరు సంపాదించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. మోహన్ బాబు మాట్లాడుతూ అందరి సహకారంతో పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయం స్థాయి వరకు రూపాంతరం చెందిందని తెలిపారు. మోహన్ బాబు విశ్వవిద్యాలయం ద్వారా ప్రముఖులైన ఇద్దరికీ గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేయటం ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు మాట్లాడుతూ చదువును ఒక మహా యజ్ఞంగా భావించి మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో పేద విద్యార్థులతో పాటు అన్ని వర్గాల వారికి విద్యను అందిస్తున్నట్లు వివరించారు.ప్రముఖ సంగీత విద్వాంసుడు ఆనందన్ శివమణికి, విశిష్ట రాజకీయ నాయకుడు, ప్రముఖ పాత్రికేయుడు మహారాష్ట్రకు చెందిన లోక్ మత్ పత్రిక అధ్యక్షుడు విజయ్ జవహర్ దార్ధాలకు మోహన్ బాబు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ల ను అందించింది. ఎంబీయూ ద్వారా 866 మంది విద్యార్థులు, శ్రీ విద్యానికేతన్ ఇంజనీరింగు కాలేజి నుండి1698 మంది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పట్టాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఇంత పెద్ద మొత్తంలో విద్యార్థులు పట్టాలు అందుకొని బాహ్య ప్రపంచంలోకి వెళుతుండటం ఎంతో ప్రశంశనీయమని అతిథులు కొనియాడారు

## యాదవ్‌పై ఆంక్షలు? వైసీపీకేమో.. అనుమతులా?

- పోలీసుల ద్వంద్వ నీతిపై రామచంద్ర యాదవ్ ఆగ్రహం

**తిరుపతి, ఆగస్టు 2(మనం న్యూస్):** ప్రభుత్వం మారినా పోలీసుల తీరులో మార్పు రాలేదని బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను కరేడుకు వెళ్లేందుకు అనేక అడ్డంకులు సృష్టిస్తున్న పోలీసులు... వైసిపి నాయకులకు మాత్రం రెడ్ కార్పెట్ పరుస్తున్నారన్నారు. ఈమేరకు శనివారం ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కరేడులో గిరిజన మహిళల అక్రమ అరెస్ట్ లను వ్యతిరేకిస్తూ తాను కరేడుకు బయలుదేరగా పోలీసులు మార్గం మధ్యలో అడ్డుకున్నారన్నారు. ఆ రోజు చట్టాన్ని గౌరవించి పోలీసుల సూచన మేరకు వెనుదిరిగి వెళ్లిపోయాన్నారు. కరేడుకు వెళ్లేందుకు పోలీసుల అనుమతుల కోసం కోర్టును ఆశ్రయించగా అందుకు ఈనెల 2లోపు పోలీసులు తమ వైఖరిని కోర్టుకు తెలపాలని న్యాయస్థానం ఆదేశించిందన్నారు. అయితే అనుమతులు ఇవ్వలేమని శనివారం మధ్యాహ్నానికి తనకు సమాచారం ఇచ్చారన్నారు. అయితే వాస్తవంగా అంతకు ముందు రోజే వైసిపి నాయకులు కరేడుకు వెళితే ఈ పోలీసులు ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. పోలీసులు ధ్వంద్వ వైఖరితో వ్యవహారించడం దారుణమన్నారు. ఇంకా కొంత మంది పోలీసుకు కక్షపూరిత ధోరణిలో వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరేడులో పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని తనకు అనుమతులు ఇవ్వని పోలీసులు... వైసిపి నాయకులు వెళితే మాత్రం వారికి పోలీస్ యాక్ట్ వర్తించదా? అని ప్రశ్నించారు. పోలీసులు అనుమతులు ఇవ్వకపోతే న్యాయస్థానం నుంచి అనుమతి తీసుకొని కరేడుకు వస్తానని ప్రకటించారు.





## నేననుకోను ..!

నేననుకోను అట్లా
గతం లోనికి పరుగెత్తాలని
గతం అవగతమే కదా!
మంచో- చెడో,తెలిసీ తెలియని
అనుభవైక నైవేద్యమే
గతం ఓ గ'మ్మత్తు'!
నీవు గతం లోకి వెళ్లినా
ఘనీభవించిన గతం
ద్రవించి నీకు జోల పాడదు!
గతానికి కొత్తగా, భవిష్యత్తుకు
వారధిగా, ప్రస్తుతం
పరుగెత్తే గత వారసత్వం!
ప్రస్తుతానికి గతం
ఎండ మావులంత తీపి
పరుగెత్తి నెమరేసుకోవడమే!
బ్రతుకు సినిమా రివైండ్ చేసుకొని
జ్ఞాపకాల అనుభూతి ఆకర్షణలో
మునిగి తేరుకోవడమే!
కలల స్వర్గం నుండి తేరుకుని
ఈ లోకం వచ్చిన క్షణం నుండి
ఎప్పటి తిప్పలు షరా మామూలే!

**- పల్లొళ్ళ బక్కారెడ్డి**
9705315250



## నాకు నేనే!

నాకు నేనే భిన్నం అనుకునేవాడిని
నా బాధలు, నా భయాలు,
నా ఆత్మన్యూనతాభావాలు -
నా గుండె గోడల మధ్య ఊగిసలాడే ఊసులు;
ఎవరూ వినరని, అర్థం చేసుకోరని నమ్మేవాడిని.

రాత్రి చీకట్లతో మాటలాడే నేను,
గాలి చప్పుడు విన్నా వణికే నేను,
ఈ ప్రపంచం అంతా నిద్రలో ఉండగా -
నా దుఃఖం మాత్రమే మేల్కొంటుందని
భీతిల్లేవాడిని.

కానీ -
ప్రతి గదిలోని మూలల్లో
తమ నీడలతో మాట్లాడుతున్న ముఖాల్ని
చూశాను.

వారి నిశ్శబ్ద నవ్వుల్లో
తడిగా దాచిన కన్నీరు,
నిశ్శబ్దంలోకి మెల్లగా జారటం చూశాను.
ప్రతి చూపు వెనుక -
ఒక పగుళ్లు పట్టిన గోడల నగరం ఉందని
గ్రహించాను.

ఒంటరితనం ఆవహించిన మనుషులంతా -
తమ కళ్ళ వెనుక దాచుకున్న బాధనంతా
తీరని వెదలోకి నెట్టేస్తారని తెలుసుకున్నాను.

**- బాలాజీ పోతుల**
8179283830

# దళిత ఉద్యమ శిఖరం కత్తి పద్మారావు

కత్తి పద్మారావు ఆంధ్రప్రదేశ్‌లో దళిత ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన ప్రముఖ నాయకుడు, తెలుగు కవి, హేతువాది, సామాజిక కార్యకర్త. ఆయన ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ స్థాపకుడు మరియు దళిత సాహిత్యంలో కీలక వ్యక్తిగా గుర్తింపు కలిగినవారు. కత్తి పద్మారావు తన కవిత్వం, సామాజిక ఉద్యమాలు,రచనల ద్వారా దళితుల ఆత్మ గౌరవం, సామాజిక న్యాయం, కుల వ్యవస్థ నిర్మూలన కోసం అవిశ్రాంతంగా కృషి చేశారు.

కత్తి పద్మారావు 1953 జులై 27న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా బాపట్ల మండలంలోని ఈతేరు గ్రామంలో దళిత మాల కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు మాణిక్యమ్మ, సుబ్బయ్య. ఇద్దరూ వ్యవసాయ కార్మికులు. సంవత్సరంలో ఆరు నెలలు వారు ఈతేరులో వ్యవసాయ కూలీలుగా, మిగిలిన ఆరు నెలలు చీరాలలోని ఇండియన్ లీఫ్ టొబాకో డిపో (ఐఎల్టీడీ)లో కార్మికులుగా పనిచేసేవారు. ఈ నేపథ్యంలో పెరిగిన పద్మారావు, దళిత సమాజం ఎదుర్కొనే సామాజిక, ఆర్థిక సవాళ్లను దగ్గరగా చూశారు. ఆయన సాహిత్యం, సమాజశాస్త్రం, మతం, తత్వశాస్త్రం,మహిళా అధ్యయనాల పై లోతైన అవగాహన కలిగి ఉన్నారు. ఈ విద్యాపరమైన నేపథ్యం ఆయన రచనలు ఉద్యమాలకు బలమైన పునాదిని అందించింది.

1985లో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో జరిగిన కారంచేడు ఊచకోత దళిత ఉద్యమ చరిత్రలో ఒక దుర్ఘటనగా నిలిచింది. ఈ సంఘటనలో కమ్మ జాతి వారు మాదిగ దళితులపై దాడి చేసి, హత్యలు,దౌర్జన్యాలకు పాల్పడ్డారు. ఈ ఘటన దళిత సమాజంలో ఆగ్రహాన్ని రేకెత్తించింది. కత్తి పద్మారావు ఈ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభను స్థాపించి, దళితుల ఆత్మగౌరవ పోరాటానికి నాయకత్వం వహించారు. ఈ సంస్థ దళితులతో పాటు ఆదివాసీలు మరియు వెనుకబడిన తరగతుల హక్కుల కోసం పోరాటం చేసింది. కారంచేడు ఉద్యమం దళిత సమాజంలో చైతన్యాన్ని తీసుకొచ్చింది.కుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఒక బలమైన ఉద్యమంగా రూపొందింది. ఈ ఉద్యమం ఫలితంగా 1989లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం ఆమోదించడంలో కత్తి పద్మారావు కీలక పాత్ర పోషించారు. ఈ చట్టం దళితులు మరియు ఆదివాసీలపై జరిగే దౌర్జన్యాలను నిరోధించడంలో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. చుండూరు ఊచకోత (1991) ఘటనను గ్రామీణ స్థాయి నుండి ఢిల్లీ వరకు ఈ సమస్యను ఉద్యమ స్థాయిలో తీసుకెళ్లారు. ఈ ఉద్యమం దళితుల హక్కుల కోసం జాతీయ స్థాయిలో చర్చను రేకెత్తించింది.

డా. కత్తి పద్మారావు ఒక ప్రముఖ తెలుగు కవి, రచయితగా కూడా గుర్తింపు పొందారు. ఆయన రచనలు దళిత సాహిత్యంలో కొత్త దిశను చూపాయి. ఆయన రచించిన 93 పుస్తకాలు ముద్రితమయ్యాయి, ఇందులో కవితా సంపుటులు, సమాజశాస్త్రం, మతం, తత్వశాస్త్రం,మహిళా అధ్యయనాలపై రచనలు ఉన్నాయి. ఆయన ప్రముఖ కవితా సంపుటి 'జైలుగంటలు' దళిత ఉద్యమ స్ఫూర్తిని, ఆత్మగౌరవాన్ని, మరియు కుల వ్యవస్థపై తిరుగుబాటును ప్రతిబింబిస్తుంది. ఆయన కవిత్వం దళిత సమాజంలోని అణచివేత, అసమానతలు,ఆత్మగౌరవ పోరాటాన్ని తీవ్రంగా వ్యక్తీకరిస్తుంది. 'కట్టెల మోపు' వంటి రచనలు దళితుల గుండె ఘోషను ప్రతిధ్వనించాయి. ఆయన కవిత్వంలో బుద్ధుడు మరియు అంబేద్కర్ ఆదర్శా లు ప్రముఖంగా కనిపిస్తాయి, మరియు ఇవి దళిత యువతకు స్ఫూర్తిని అందించాయి. దళిత ఉద్యమం చారిత్రకంగా అసమానతలు, అస్పృశ్యత, కుల ఆధిపత్యం వంటి సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా జరిగింది. గౌతమ బుద్ధుడి కాలం నుంచి ఆధునిక భారతదేశంలో డా. బాబాసాహెబ్ అంబేడ్కర్, జ్యోతిబాపూలే, భాగ్యరెడ్డి వర్మ వంటి నాయకుల వరకు ఈ ఉద్యమం వివిధ రూపాల్లో కొనసాగింది. రాజకీయాలు ఈ ఉద్య మంలో కీలకమైనవి. 1980ల తర్వాత, దళిత ఉద్యమం రాజకీయ అంశాలపై ఎక్కువ దృష్టి పెట్టింది. సమాన రాజకీయ ప్రాతినిధ్యం, అధికారంలో భాగస్వామ్యం కోసం పోరా డింది. ఆంధ్రప్రదేశ్లో దళిత మహాసభ ఈ



రాజకీయ చైతన్యాన్ని ముందుకు తీసుకెళ్లింది. రాజకీయ సిద్ధాంతావేత్తగా డా. కత్తి పద్మారావు కృషి లోకానికి తెలియనిది కాదు. దళిత ఉద్యమకారుడుగా, దళిత దార్శనికుడుగా, మహా కవిగా, మహా వక్తగా నాలుగు దశాబ్దా లుగా చేసిన కృషి అనితర సాధ్యం.

కత్తి పద్మారావు ఆంధ్రప్రదేశ్‌లో దళిత ఉద్యమానికి ప్రముఖ నాయకుడు. 1985లో కారంచేడు మారణకాండ (Karamchedu Massacre) తర్వాత ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ స్థాపక ప్రధాన కార్యదర్శిగా ఆయన దళితులపై కుల దాడులకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపించారు. ఆయన ప్రభావం దేశవ్యాప్తంగా దళిత ఉద్యమాలపై చూపెట్టింది. దీని ద్వారా జాతీయస్థాయిలో రాజకీయ నాయకులు సన్నిహితులయ్యారు. పరస్పరం ప్రభావితులయ్యారు. అనేక అంశాలలో సమన్వయం సాధించారు. అలా సన్నిహితులైన వారిలో మాజీ ప్రధాని వి.పి.సింగ్, బిఎస్‌పి నాయకుడు కాన్షిరాం, రామ్ విలాస్ పాశ్వాన్, మాయావతి, శరద్ పవార్, వెలుమలై, భూటా సింగ్, బుద్ధిష్ట్ ధర్మవీర్, రామ్ మదన్, మల్లు రవి, కొప్పుల రాజు, ఉండ్రు రాజశేఖర్, గీతారెడ్డి తదితరులు.

డా. కత్తి పద్మారావు కారంచేడు ఉద్యమాల అనుభవాలతో ప్రజలకు ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ అవసరమని భావించారు. 1988లో పేద ప్రజల పార్టీ ( Poor people's Party & PPP) అనే రాజకీయ పార్టీ ఏర్పాటు చేశారు. 1989లో వైస్ ప్రిన్సిపాల్ ఉద్యోగానికి రాజీనామా చేసి బీఎస్పీ పార్టీలో జాయిన్ అయ్యారు. కాన్షిరాంతో కలసి జాతీయ స్థాయిలో మూడు ప్రత్యామ్నాయ రాజకీయ మహాసభలు నిర్వహించారు. కాన్షిరాం 21 పర్యటనలు ఉంటే అందులో 17 పర్యటన లలో డా. కత్తి పద్మారావు ఆయనతో పాటు ప్రయాణిస్తూ సభలలో పాల్గొనేవారు. 1998లో ప్రపంచ దళిత మహాసభలు మలేసియాలో జరిగాయి. కాన్షిరాంతో పాటు కత్తి పద్మారావు పాల్గొని కుల, మత, లింగ, జాతి వివక్షకు గురవుతూ అణగదొక్కబడు తున్న వారంతా వారంతా దళితులే అని తీర్మానించారు. మలేసియా పర్యటన నుంచి వచ్చి లక్నోలో బౌద్ధ అంతర్జాతీయ విమానాశ్రయం పెట్టి ప్రపంచంలోని బౌద్ధులందరికి ఉత్తరప్రదేశ్ లక్నో సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రత్యామ్నాయ సంస్కృతి నిర్మాణం చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. లక్నోలో డా.బాబాసాహెబ్ అంబే డ్కర్ పార్క్ నిర్మాణం అలా చేపట్టిందే.

ప్రత్యామ్నాయ సంస్కృతి వ్యక్తిత్వాల నిర్మాణంలో తమిళనాడులో పెరియార్ రామస్వామి చేసిన ఉద్యమాలను, నిర్మాణాలను కాన్షిరాంతో కలసి లక్నోలో పెరియార్ రామస్వామి పేరిట ప్రత్యామ్నాయ రాజకీయ, సాంస్క ృతిక మహాసభలు నిర్వహించారు. ఈ మహా సభలు దేశవ్యాప్తంగా ప్రజలను ఆకర్షించాయి. ఒక విధంగా చెప్పాలంటే పెరియార్ రామస్వామి ద్రావిడ ఉద్యమాన్ని ఉత్తర భారతదేశానికి పరిచయం చేసిన వ్యక్తి కత్తి పద్మారావు అని చెప్పుకోవాలి. మాయావతి ముఖ్యమంత్రి హోదాలో ఈ మహా సభలకు దేశవ్యాప్తంగా తరలివచ్చిన రచయితలకు, కళాకారులకు, సాహితీవేత్తలకు ప్రభుత్వ లాంఛనాలతో సకల సౌకర్యాలు ఏర్పాటు చేసి పురస్కారాలు అందచేశారు. దేశంలోనే మొట్టమొదటి సారి దళిత, వెనకబడిన తరగతుల కళాకారులకు, సాహితీవేత్తలకు అంత పెద్ద గౌరవం దక్కడం. ప్రత్యక్ష రాజకీయాలలో డా.కత్తి పద్మారావు 1994లో బీఎస్పీ తరుపున బాపట్లలో పోటీచేసి 23వేలకు పైగా ఓట్లు సాధించారు. 2009లో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటు చేసినప్పుడు ప్రత్యామ్నాయ రాజకీయలకు వేదికగా మలచడానికి కత్తి పద్మారావు ఆ పార్టీలో చేరారు. వాటి ప్రణాళికలను రూపొందించిచారు. ఆంధ్రప్రదేశ్ రాష్టం తెలంగాణ-ఆంధ్రప్రదేశ్‌గా విడిపోయిన తరువాత నూతన రాష్ట్రంలో నవ్యాంధ్ర పార్టీ నిర్మాణం చేసి ప్రత్యామ్నాయ రాజకీయలకు సిద్ధాంత భూమికను అందిస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్ లో 150 అడుగుల డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం నిర్మించాలని అనేక ప్రాంతాల్లో పర్యటించి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి విజయవాడ PWDగ్రౌండ్‌లో నిర్మించిన డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం కత్తి పద్మారావు కృషి అని చెప్పక తప్పదు.

డా. కత్తి పద్మారావు దళితులకు జ్ఞానంపట్ల, జ్ఞానయుగం పట్ల ఆసక్తిని అవగాహనను పెంచుతున్నారు. యువత రాజకీయ లలో కూడా ప్రవేశించాలని, అనేక మార్గదర్శకాలు సైద్ధాంతిక రచనలు అందిస్తున్నారు. అందులో భాగంగా 'భారతరాజకీయాలు-కులాధిపత్య రాజకీయం ప్రత్యామ్నాయ వ్యక్తిత్వాలు' అనే ఈ గ్రంధాన్ని వెలువరించారు. సమాజాన్నిముందుకు నడపాలనుకునే దార్శనికులు, చరిత్రకారులు, సామాజిక విప్లవకారులు, చరిత్రను, సామాజిక శాస్త్రాలను, సంస్కృతిని అధ్యయనం చేసి పునర్ వ్యాఖ్యానిస్తారు. బుద్ధుడు, నాగార్జునుడు, కబీర్, గురురవిదాస్, వేమన, హెగెల్, మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, మావో, మహాత్మా జ్యోతిరావు పూలే, డా.బాబాసాహెబ్ అంబేడ్కర్, రాహుల్ సాంకృత్యాయన్, దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ, డి. డి కోశాంబి, వివేకానందుడు మొదలైన వాళ్ళు తమ కాలంనాటికి వెలువడి ప్రాచుర్యంలో ఉన్న తత్వశాస్త్రాల్ని అధ్యయనం చేసి పునర్ వ్యాఖ్యానిస్తూ, పునర్ నిర్మిస్తూ ముందుకు సాగినవారే. ఈ కోవలో మన కాలంనాటి తత్వవేత్త డా. కత్తి పద్మారావు. డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ బోధించిన విధంగా కులాంతర వివాహం చేసుకున్నారు, తన వారసులకు కూడా కులాంతర వివాహాన్ని చేశారు. కత్తి పద్మారావు ఒక తత్వవేత్త గా ఆలోచిస్తారు, డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ వారసుడిగా ఆచరణ రూపాలు తీసుకుంటారు.రక్తపు జ్వాలాలతో ఎగిసి పడుతున్న సమాజన్ని బుద్ధుడి-అంబేడ్కర్ శాంతి మార్గంలో నడిపించి, బాధితుల వద్దకే కోర్టును తీసుకువచ్చిన నాయకుడిని సత్కరించటం బాధ్యత మహనీయుల మార్గాన్ని అనుసరించడం పే-బ్యాక్ టు సొసైటీ గా 19 అక్టోబర్ 2019న ఒంగోలులో శ్రీమతి రమాభాయి అంబేడ్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కత్తి పద్మారావును వేలాదిమంది సమక్షంలో 'దళిత ఉద్యమశిఖరం' అనే బిరుదుతో సత్కరించారు.

**- వెంకట్. బల్లికురవ**
9652680802

# ప్రభుత్వ బడుల్లో భాషాభివృద్ధి వాతావరణం...



చదివే సామర్థ్యం కలిగిన విద్యార్థులకు చదవడం అలవాటుగా మారితే వారిలో విషయ పరిజ్ఞానం,విచక్షణా శక్తి, ఉత్తమ వైఖరులు, సహనశీలత వంటి మంచి లక్షణాలు పెంపొందుతాయి. చదవడం అలవాటుగా చేయడానికి పాఠశాల మూల కేంద్రం కనుక రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తున్నది. రూమ్ టు రీడ్ సంస్థ వారి సౌజన్యంతో రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (SCERT)ప్రభుత్వ బడుల్లో పుస్తకాల చెంతకు పిల్లలు చేరేటట్లు భాషాభివృద్ధి వాతావరణం కల్పించడానికి కృషి చేస్తున్నది. పిల్లల్లో మౌలిక భాష సామర్థ్యాలను పెంపొందించడానికి అమలు పరుస్తున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా పఠన సామర్థ్యాన్ని పెంచడానికి విద్యార్థులను స్వతంత్ర పాఠకులుగా మార్చడానికి రాష్ట్ర విద్యాశాఖ సత్ఫలితాలు ఇచ్చే విధంగా ప్రయత్నం ప్రారం భించినది. ప్రస్తుత సమాజంలో విస్తరిస్తున్న ప్రపంచీకరణ నేపథ్యంలో అరచేతిలో ఇమిడి పోతున్న చరవాణి బాల్యాన్ని పుస్తకానికి దూరం చేస్తున్నది. ఇలాంటి విపత్కర పరిస్థితి నుండి విద్యార్థులను బయటకు లాగి పఠన కార్యక్రమంలో పిల్లలు మరింత ఉత్సాహంగా పాల్గొనేలా ప్రభుత్వ బడుల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చిన విద్యాశాఖ అందుబాటులో ఉన్న నాణ్యమైన బాల సాహిత్యమును పిల్లలకు చేరువ చేయడానికి ప్రణాళిక రూపొందించి క్షేత్రస్థాయిలో అమలుపరుస్తున్నది. ప్రతి పాఠశాలలో ప్రతి తరగతికి గ్రంథాలయం పిరియడ్‌ను అందుబాటులోకి తెచ్చి పుస్తకాలు చదువేలా అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నారు. అలాగే పిల్లలు ఖాళీ సమయాల్లో పఠనం చేసేలా పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదివే విధంగా ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారు. విభిన్నంగా గ్రంథాలయ నిర్వహణ చేయడం వల్ల విద్యార్థులలో నైతిక విలువలు పెరిగి సమాజంలో మంచి పౌరులుగా ఎదిగే అవకాశం ఉంది. అలాగే విద్యార్థులు ఉపాధ్యాయులతో కూడిన గ్రంథాలయ నిర్వహణ కమిటీని ఏర్పాటు చేయడం, పఠన విధి విధానాలు రూపొందించడం, అందుబాటులో నాణ్యమైన బాలసాహిత్యాన్ని ఉంచడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో పఠన సంస్క ృతి ప్రతిబింబించేలా ప్రోత్సాహక



వాతావరణ చోటుచేసుకోనుంది. పిల్లలకు బొమ్మలతో, అక్షరాలతో, పదాలతో చార్టులతో, కవితలతో మరియు ఇతర ముద్రిత సామాగ్రితో సృజనాత్మకంగా అభ్యాసనాన్ని పెంపొందించే ముద్రిత సమృద్ధి వాతావరణం కల్పించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

**రూమ్ టు రీడ్ వారి సహకారం. ..**

ప్రభుత్వ పాఠశాలలో అనేక వినూత్న కార్యక్రమాలు అమలు కోసం విద్యార్థులలో అభ్యసన ఫలితాలు సాధన కోసం అనేక స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి తమ కార్యచరణ ప్రణాళికలు అమలు పరుస్తున్నాయి. అందులో భాగంగా ప్రభుత్వ బడుల్లో స్నేహపూర్వక గ్రంథాలయాల ఏర్పాటుకు అలాగే అనేక రకాల బాల సాహిత్యమును విద్యార్థుల దరికి చేర్చడానికి రూమ్ టూ రీడ్ అనే స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర విద్య పరిశోధన సంస్థకు తోడ్పాటును అందిస్తున్నది. విద్యార్థుల చదివే స్థాయికి అనుగుణంగా GROWBY పుస్తక స్థాయిలను చదువు రాని పిల్లవాడి నుండి దారాళంగా చదివే పిల్లవాడి స్థాయి వరకు పుస్తకాలను అందజేస్తున్నది.

అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు అందజేసినది. అంతరాజతీయ పఠన సిఫార్సు సంఘం ప్రకారం ఒక తరగతి గదిలోని ఒక్కొక్క చిన్నారి ఏడు వైవిధ్య మైన శీర్షికల చొప్పున చదివే విధంగా రాష్ట్ర ప్రభుత్వం మరియు రూమ్ టూ వీడు సంస్థ కృషి చేస్తున్నది. 'ఒక మంచి పుస్తకం వంద మంది మిత్రులతో సమానం' అని అబ్దుల్ కలాం చెప్పినట్లు చదువు -ఆనందించు- అభివృద్ధి చెందు. అనే నినాదంతో ప్రభుత్వ బడుల్లో అభ్య సన వాతావరణం వృద్ధి చెందాలని పిల్లలందరూ పుస్తక ప్రపంచంలో విహరించాలని ఆకాంక్షిద్దాం.

**- అంకం నరేష్**
6301650324

## ఒకవేళ నేను...

ఒకవేళ నేను...
ఒక హృదయాన్ని
పగిలిపోకుండా ఆపగలిగితే
వ్యర్థంగా కాకుండా నేను
అర్థవంతంగా జీవించినట్లే సుమా!

ఒకవేళ నేను...
ఒక వేదనామయజీవితాన్ని
సుఖవంతంగా మార్చగలిగినా,
లేదా ఒక బాధను చల్లార్చగలిగినా,
లేదా మూర్ఛిల్లుతూన్న ఒక రాబిన్ పక్షిని
మళ్ళీ దాని గూడులోకి చేర్చగలిగితే...
వ్యర్థంగా కాకుండా నేను
అర్థవంతంగా జీవించినట్లే సుమా!!!
అమెరికాలో కనిపించే ఎరుపురంగు చిన్నపక్షి.

**ఆంగ్లమూలం ఎమిలీ డికిన్సన్**
**స్వేచ్ఛాకవితానువాదం 'రఘువర్మ'**

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**– ఎడిటర్**

# జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య

భారతీయులు సగర్వంగా, సగౌరవంగా తలెత్తి వందనం చేసే, భారత సార్వభౌమాధికారానికి ప్రతీక అయిన త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య. స్వాతంత్ర్య సమరయోధునిగా, వ్యవసాయ, భూగర్భ ఖనిజ శాస్త్రవేత్తగా, జపనీస్ భాషా బోధకునిగా, చిత్రకారునిగా, వివిధ దేశాల పర్యాటకునిగా, బహుముఖ ప్రజ్ఞ కలిగిన వెంకయ్యను భారతీయులంతా గుర్తు చేసుకోవాల్సిన సందర్భం అనివార్యం. 1878 ఆగస్టు 2న కృష్ణాజిల్లా పెద్ద కళ్ళేపల్లెలో జన్మించిన వెంకయ్య, భట్లపెనుమర్రిలో విద్యాభ్యాసం ముగించుకొని తన19వ ఏట ముంబై వెళ్లి సైన్యంలో చేరారు.

మద్రాసులో ప్లేగు ఇన్‌స్పెక్టరు శిక్షణ పూర్తి చేసి, కొంతకాలం బళ్లారిలో ప్లేగ్ ఇన్‌స్పెక్టరుగా పని చేసారు. శ్రీలంక వెళ్ళి కొలంబోలోని సిటీ కాలేజీలో పొలిటికల్ ఎకనమిక్స్ ప్రత్యేక విషయంగా చదివి కేంబ్రిడ్జ్ సీనియర్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యారు. లాహోర్‌లోనిడి.ఎ.వి.కాలేజీలో సంస్కృతం, ఉర్దూ, జపాన్ భాషల్లో మంచి పాండిత్యం సంపాదించారు. జపాన్‌భాషలో అనర్గళంగా మాట్లాడే వెంకయ్యను 'జపాన్ వెంకయ్య' అని పిలిచే వారు.

1899-1902 మధ్య డచ్ సైన్యానికి వ్యతిరేకంగా, దక్షిణాఫ్రికాలో బోయర్ యుద్ధంలో పాల్గొన్నారు. అక్కడే ఆయనకు స్వాతంత్రోద్యమ నిర్దేశకులు, భావిభారత జాతిపిత మహాత్మా గాంధీతో పరిచయం ఏర్పడింది. దక్షిణాఫ్రికాలో ఉండగా మహాత్మా గాంధీని కలిశారు. గాంధీతో వెంకయ్యకు ఏర్పడిన ఈ సాన్నిహిత్యం అర్ధశతాబ్దం పాటు నిలిచింది. భూగర్భ ఖనిజ శాస్త్రవేత్తగా మైకా, వజ్రాలపై ఆయన విస్తృత పరిశోధనలు జరిపారు. స్వదేశం వస్తూ అరేబియా, ఆఫ్ఘనిస్థాన్‌లు చూచి వచ్చారు. గాంధీజీ పరిచయం అయిన నాటి నుండి జాతీయ జెండా ఎలా ఉండాలనే సమస్యనే తన అభిమాన విషయంగా పెట్టుకొని, దాని గురించి దేశంలో ప్రచారం ప్రారంభించారు. 1913 నుండి ప్రతి కాంగ్రెస్ సమావేశానికి హాజరై, నాయకులందరితోనూ జాతీయ పతాక రూపకల్పన గురించి చర్చలు జరిపారు. 1916లో 'భారత దేశానికి ఒక జాతీయ పతాకం' అనే ఆంగ్ల గ్రంథాన్ని రచించారు.

1916 లో 'నీడ్ ఫర్ నేషనల్ ఫ్లాగ్' పేరున 30 నమూనాలతో జాతీయ పుస్తక రచన గావించారు. ఈ గ్రంథానికి అప్పటి వైస్రాయ్ కార్యనిర్వాహక సభ్యుడైన కేంద్రమంత్రి సర్ బి.ఎన్.శర్మ ఉత్తేజకరమైన పీఠిక రాశారు. 1916లో లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో వెంకయ్య తయారు చేసిన జాతీయ జెండానే ఎగుర వేశారు. 1919లో జలంధర్ వాస్తవ్యులైన 'లాలా హన్స్ రాజ్' మన జాతీయ పతాకంపై రాట్న చిహ్నముంటే బాగుంటుందని సూచించగా గాంధీజీ దాన్ని అంగీకరించారు. 1921లో అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలు బెజవాడలో జరిగాయి. గాంధీజీ వెంకయ్యను ఆ సమావేశానికి పిలిపించి కాషాయం, ఆకుపచ్చ రంగులు కలిగి, మధ్య రాట్నంగల ఒక జెండాను చిత్రించమని కోరారు. మహాత్ముడు సూచించిన ప్రకారంగానే జెండాను సమకూర్చాడు వెంకయ్య. అనంతరం వచ్చిన ఆలోచనల మేరకు, సత్యం, అహింసలకు ప్రత్యక్ష నిదర్శనమైన, తెలుపు రంగు కూడా ఉండాలని గాంధీజీ అభిప్రాయ పడగా, వెంకయ్య ఆ జెండాలో అదనంగా తెలుపు రంగును చేర్చి, నేటి త్రివర్ణ పతాకాన్ని దేశానికి ప్రసాదించారు.

'మడత పెడితే పిడికెడే కానీ, కోటానుకోట్ల భారతీయుల ప్రియవస్త్రం'గా గాంధీజీచే వెంకయ్య




రూపకల్పన చేసిన జాతీయ పతాకం ప్రశంసా పాత్రమైంది.

1947, జూలై 22 వ తేదీన భారత రాజ్యాంగ సభలో నెహ్రూ జాతీయ జెండా గురించి ఒక తీర్మానం చేస్తూ, మునుపటి త్రివర్ణ జెండాలోని రాట్నాన్ని తీసేసి, దాని స్థానంలో అశోకుని ధర్మ చక్రాన్ని చిహ్నంగా ఇమిడ్చారు. చిహ్నం మార్పు తప్పితే పింగళి వెంకయ్య రూపొందించిన జెండాకు నేటి జెండాకు తేడా ఏమీ లేదు. అశోకుని ధర్మ చక్రం మన పూర్వ సంస్క ృతికి సంకేతం.

పింగళి వెంకయ్య 1906 నుంచి 1922 వరకు భారత జాతీయోద్యమం లోని వివిధ ఘట్టాలలో పాల్గొన్నారు. వందేమాతరం, హోమ్రూల్ ఉద్యమం, ఆంధ్రోద్యమం లాంటి ప్రసిద్ధ ఉద్యమాలలో ప్రధాన పాత్రధారిగా ఉన్నారు. భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత ఆయన బెంగుళూరు, మద్రాసులలో 'రైల్వే గార్డు'గా పనిచేశారు. ఆ తరువాత కొంత కాలం బళ్లారిలో 'ప్లేగు అధికారి'గా ప్రభుత్వ ఉద్యోగం చేశారు. వెంకయ్యలో ఉన్న దేశభక్తి ఆయనను ఎంతో కాలము ఉద్యోగం చేయనివ్వలేదు.

1906 నుండి 1922 వరకు జాతీయోద్యమాలతో పాటు మునగాల పరగణా నడిగూడెంలో జమీందారు రాజా బహదూర్ నాయని రంగారావు కోరిక మేరకు, నడిగూడెంలో నివాసముండి, పత్తి మొక్కలలోని మేలు రకముల పరిశోధనలో వినియోగించారు. నడిగూడెంలో వ్యవసాయ క్షేత్రాన్ని నిర్మించాడు. ఈ పరిశోధనలలో 'కంబోడియా పత్తి' అను ఒక ప్రత్యేక రకమైన పత్తి మీద విశేష కృషి చేశారు. ఆయన కృషిని ఆనాటి బ్రిటీషు ప్రభుత్వం కూడా గుర్తించడముతో ఆయనకు 'పత్తి వెంకయ్య' అని పేరు వచ్చింది.

తరువాత నెల్లూరు చేరి, 1924 నుండి 1944 వరకు అక్కడే ఉంటూ మైకా (అభ్రకం) గురించి పరిశోధన చేశారు. వజ్రకరూరు, హంపిలలో ఖనిజాలు, వజ్రాలు గురించి విశేషంగా పరిశోధనలు జరిపి ప్రపంచానికి తెలియని వజ్రపు తల్లిరాయి అనే గ్రంథం రాసి 1955లో దాన్ని ప్రచురించారు. దేశానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత ప్రభుత్వం వెంకయ్యను ఖనిజ పరిశోధక శాఖ సలహాదారుగా నియమించింది. ఆ పదవిలో ఆయన 1960 వరకు పనిచేసారు.

అయితే వెంకయ్య జీవిత చరమాంకం దయనీయ స్థితిలో ముగిసింది.1960 లో భారత ప్రభుత్వం భూగర్భ ఖనిజాలు సంస్థ సలహాదారునిగా వెంకయ్యకు ఇచ్చే గౌరవ వేతనాన్ని సైతం నిలిపి వేసింది. వృద్ధాప్యంలో ఆర్థిక బాధలు ఆయనను చుట్టు ముట్టాయి. మిలటరీలో పని చేసినందుకు విజయవాడ చిట్టినగరులో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో, ఆయన గుడిసె వేసుకొని దార్రిద్య జీవితాన్ని గడపవలసి వచ్చింది. జీవితాంతం దేశం కొరకు, స్వాతంత్ర్యం కొరకు పోరాడిన వెంకయ్య చివరి రోజుల్లో తిండికి కూడా మొహం వాచి, నానా అగచాట్లు పడినట్లు 'త్రివేణి' సంపాదకులు డా. భావరాజు నరసింహారావు పేర్కొన్నారు. అంతిమదశలో విజయవాడలో డా. కె.ఎల్.రావు,డా.టి.వి.ఎస్.చలపతిరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు మున్నగు పెద్దలు 1963 జనవరి 15న వెంకయ్యను సత్కరించి, కొంత నిధిని అందించారు. కన్నుమూసే ముందు ఆయన చివరి కోరికను వెల్లడిస్తూ ' నా అంత్య దశ సమీపించింది. నేను చనిపోయిన తర్వాత త్రివర్ణ పతాకాన్ని నా భౌతిక కాయంపై కప్పండి. శ్మశానానికి చేరిన తర్వాత ఆ పతాకం తీసి అక్కడ ఉన్న రావి చెట్టుకు కట్టండి. ఇది నా తుది కోరిక' అన్నారు.

ఆత్మాభిమానానికి మారుపేరైన వెంకయ్య, కడు పేదరికాన్ని అనుభవిస్తూ, 1963 జూలై 4న విజయవాడలో తుది శ్వాస వదిలారు. 1964లో జూలైలో నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి, వెంకయ్య చిత్రపటాన్ని ఆవిష్కరించినా, విజయవాడ గాంధీ హాల్ నందు విగ్రహావిష్కరణ జరిగినా, భారతీయులు ఆచంద్ర తారార్కం గుర్తుంచుకోవలసిన పింగళి వెంకయ్యకు రావలసిన గౌరవం రాకపోవడం నిజంగా బాధాకరం. గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాదులో ట్యాంక్ బండ్‌పై ఆయన కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసి ఆయన దర్శన భాగ్యం ప్రజలకు లభింపజేసి కొంతలో కొంతైనా ప్రజలకు గుర్తుండేలా చేసింది.

**- రామ కిష్టయ్య సంగనభట్ల**
9440595494

# గిరిజన న్యాయ జాగృతి కీలక మైలురాయి

- నల్సా సంవాద్‌తో ఆదివాసీల జీవితాల్లో వెలుగులు
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారీ.




ఎ.కొండూరు, ఆగస్టు 02(మనం న్యూస్): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (ఎస్ఎల్ఎస్ఏ) చరిత్రలో గిరిజన న్యాయ జాగృతి కీలక మైలురాయి అని.. నల్సా సంవాద్ పథకంతో ఆదివాసీల జీవితాల్లో కొత్త వెలుగులు రానున్నాయని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ రవినాథ్ తిల్హారీ అన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, కృష్ణా జిల్లా న్యాయసేవాధికార సంస్థ, ఎన్టీఆర్ జిల్లా పరిపాలనా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఎ.కొండూరు ఎస్ఎన్ కన్వెన్షన్ హాల్లో గిరిజన న్యాయ జాగృతి పేరుతో కొత్త మాడ్యూల్ న్యాయ సేవల శిబిరం జరిగింది. గిరిజనుల ఆరోగ్యం, హక్కుల రక్షణ, సమస్యలకు పరిష్కారం లక్ష్యంగా జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ రవినాథ్ తిల్హారీ మాట్లాడుతూ నల్సా సంవాద్ (ఖిఅఖఅ్శ - స్ట్రెంథనింగ్ యాక్సెస్ టు జస్టిస్ ఫర్ మార్జినలైజ్డ్ వల్నరబుల్ ఆదివాసీస్ అండ్ డీనోటిఫైడ్/నోమాడిక్ ట్రైబ్స్) పథకం-2025 ప్రయోజనాలు, లీగల్ ఎయిడ్ క్లినిక్లు, గిరిజనుల సాధికారతకు దోహదం చేస్తాయన్నారు. ఎలాంటి వివక్షకు తావులేకుండా గిరిజనుల హక్కుల పరిరక్షణలో పారా లీగల్ వాలంటీర్లు, ప్యానెల్ న్యాయవాదులు కీలకపాత్ర పోషించనున్నారని.. ఈ సరికొత్త పథకం ద్వారా కేవలం న్యాయ సహాయ సేవలే కాకుండా గిరిజనుల అభివృద్ధికి గొప్ప మార్గం వేయడం జరుగుతుందని, ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ద్వారా పూర్తిస్థాయి లబ్ధిజరిగేలా కృషిచేయడం జరుగుతుందన్నారు. గిరిజనుల సమాగ్రాభివృద్ధికి ఉన్న అడ్డంకులను గుర్తించి, తొలగించడం ముఖ్యమని.. కిడ్నీ వ్యాధుల ప్రభావిత ప్రాంతమైన ఎ.కొండూరులో ప్రజలు ఆరోగ్య హక్కుతో పాటు ఇతర అన్ని హక్కులు పొందేలా చేయడంలో ప్రభుత్వ విభాగాలు, న్యాయ వ్యవస్థ సమష్టి కృషి కీలకమన్నారు. వైద్య శిబిరాల ద్వారా నిరంతర నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు లీగల్ ఎయిడ్ క్లినిక్లు తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా సేవలు అందిస్తాయన్నారు. ఈ కార్యకలాపాలను రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ నిరంతరం పర్యవేక్షిస్తుందని, రాజ్యాంగం కల్పించిన హక్కులు గిరిజనులు పొందేలా చేయిచేయి కలుపుదామని జస్టిస్ రవినాథ్ తిల్హారీ పేర్కొన్నారు. కొత్త ఆలోచనలతో కొత్త జీవితం: కృష్ణా డీఎల్ఎస్ఏ ఛైర్పర్సన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ జి.గోపి కృష్ణా డీఎల్ఎస్ఏ ఛైర్పర్సన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ జి.గోపి మాట్లాడుతూ ప్రభుత్వం, ప్రజలను అనుసంధానిస్తూ రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థలు సేవలు అందిస్తున్నాయని, ఈ సేవలపై ప్రజలు అవగాహన పెంపొందించుకొని, సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. న్యాయం దృష్టిలో అందరూ సమానులేనని.. ఏ ఒక్కరూ ఆర్థిక, ఇతర సమస్యల కారణంగా న్యాయాన్ని పొందే అవకాశాలను కోల్పోకుండా ఉండేందుకు ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతోందని పేర్కొన్నారు. సంవాద్ స్కీమ్ను సద్వినియోగం చేసుకొని, స్వీయ క్రమశిక్షణతో, కొత్త ఆలోచనలతో గిరిజనులు అభివృద్ధి పథంలో పయనించాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎ.కొండూరు ప్రాంతంలో ఉచిత న్యాయ సేవలు, పారా లీగల్ వాలంటీర్ల సేవలు, నవోదయం అమలు, ఉచిత వైద్య శిబిరాలు తదితరాలను జి.గోపి క్షుణ్నంగా వివరించారు.

**స్వర్ణాంధ్ర దిశగా ఇదో గొప్ప ముందడుగు: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్. జి.లక్ష్మీశ**

వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధన దిశగా చేస్తున్న ప్రయాణంలో గిరిజనులను జాగృతం చేసి వారి సమగ్రాభివృద్ధికి ఉపయోగపడే గొప్ప కార్యక్రమం ఇదని.. న్యాయ సేవాధికార సంస్థల సేవలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. పీఎం జన్మన్, ధాత్రి ఆభా - జన భాగిధరి అభియాన్, పీఎం సూర్యఘర్ వంటివాటిని ఉపయోగించుకోవాలన్నారు. అటవీ హక్కుల చట్టం, 2006 కింద ఎస్టీ రైతులకు 434 ఆర్వోఎఫ్ఆర్ పట్టాలకుగాను 684 ఎకరాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వినూత్న పీ4 విధానం, కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీస్ చట్టం పటిష్ట అమలు, జల్ జీవన్ మిషన్ పనులు, బాధితులకు పరిహారం, నియోజకవర్గాల దార్శనిక ప్రణాళికలు, తలసరి ఆదాయంలో పెరుగుదలకు తీసుకుంటున్న చర్యలు, 15 శాతం సుస్థిర వార్షిక ఆర్థిక వృద్ధి సాధనకు చర్యలు వంటివాటిని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.



**గిరిజనులకు అండగా పోలీసు వ్యవస్థ: సీపీ రాజశేఖరబాబు**

గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వాలు వివిధ పథకాలు, కార్యక్రమాలను అమలుచేస్తున్నాయని.. వాటిపై అవగాహన పెంపొందించుకొని సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. మానవ హక్కుల ఉల్లంఘనకు తావులేకుండా, రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల పరిరక్షణకు సమష్టిగా కృషిచేయాల్సిన అవసరముందన్నారు. బడుగుబలహీన వర్గాలపై అరాచకాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రతి గ్రామంలో, తండాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీస్ చట్టాన్ని పటిష్టంగా అమలుచేస్తున్నామని.. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా కృషిచేస్తున్నట్లు తెలిపారు. నాటుసారా రహిత జిల్లా లక్ష్యంగా నవోదయం 2.0 కార్యక్రమాన్ని అమలుచేస్తూ పరివర్తనకు కృషిచేస్తున్నట్లు సీపీ వివరించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ), వైద్య ఆరోగ్య శాఖ, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, వ్యవసాయం, ఉద్యాన, విభిన్న ప్రతిభావంతులు, మైనారిటీ తదితర శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను జస్టిస్ రవినాథ్ తిల్హారీ.. అధికారులతో కలిసి పరిశీలించారు. లబ్ధిదారులకు మెడికల్ కిట్లు అందజేశారు. ఎ.కొండూరు మండలంలోని 32 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ (2025-26 జులై)కి సంబంధించి రూ. 4.70 కోట్ల చెక్కు అందించారు. అదేవిధంగా 32 మంది ఎంట్రప్రెన్యూర్లకు స్త్రీనిధి మహిళా బ్యాంకు ద్వారా రూ. 30 లక్షల చెక్కు, నవోదయం 2.0 కార్యక్రమంతో 15 కుటుంబాలకు జీవనోపాధి కోసం రూ. 10 లక్షల సీఎస్ఆర్ నిధుల చెక్కు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్ఎల్ఎస్ఏ మెంబర్ సెక్రటరీ బీఎస్వీ హిమబిందు, డిప్యూటీ సెక్రటరీ డా. హెచ్.అమర రంగేశ్వరరావు, డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) కేవీ రామకృష్ణయ్య, తిరువూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ వెంకటరెడ్డి, డీఎంహెచ్వో డా. ఎం.సుహాసిని, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, వివిధ శాఖల అధికారులు, ప్రజలు హాజరయ్యారు.

## దుర్గమ్మ గుడిలో ఈఈ కోటేశ్వరరావుకు సంకట పరిస్థితి..?



విజయవాడ పశ్చిమ, ఆగస్టు 02(మనం న్యూస్): దేశంలోనే అతిపెద్ద దేవస్థానం అయిన విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గ గుడిలో ఎజైల్ సెక్యూరిటీ సంస్థ సిబ్బంది కీలకంగా ఉన్న ఆలయ అధికారులను సైతం బెదిరింపులకు గురి చేస్తున్నట్లుగా సమాచారం. గుడిలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా విధులు నిర్వహించాల్సిన సెక్యూరిటీ సంస్థలో పనిచేస్తున్న మహిళా సిబ్బందిని అడ్డు పెట్టుకుని తమకు ఎదురు తిరిగిన వారిపైన కక్ష సాదింపు చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లవెత్తుతున్నాయి. గతంలో ఈ ఈ కోటేశ్వరరాను ఎజైల్ సెక్యూరిటీ సంస్థకు చెందిన ఓ మహిళా సిబ్బందితో వల పన్ని సదరు అధికారిని అశ్లీలంగా ఫోటోలు తీయించి ఓ దిన పత్రికలో నగ్న చిత్రాలతో వార్తలు వేయించిన సందర్భంలు లేక పోలేదు. దుర్గ గుడిపైన పాగా వేసేందుకు సెక్యూరిటీ సంస్థలో పనిచేస్తున్న మహిళా సిబ్బందిని ఆయుధాలుగా వాడుతూ ఎదురు తిరిగిన వారి పైన నగ్నంగా ఫోటోలతో పత్రికలలో వార్తలు వేయించి దుర్గమ్మ ఆలయ ప్రతిష్టను దెబ్బతీసేందుకు యత్నాలు సాగించారనే ఆరోపణలు లేకపోలేదు. ఇటీవల ఓ భక్తుడి పైన దాడి చేయించి అదే వ్యక్తి పైన స్థానిక పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేయించడంతో సదరు భక్తుడు సంచలన లాయర్ సలీం ను ఆశ్రయించారు. దీంతో రంగంలలోకి దిగిన లాయర్ సలీం దుర్గ గుడి ఇఒ కు లీగల్ నోటీసులు పంపారు. దీంతో అసలు సిసి టివి రూములోపలకు వెళ్లి కంప్యూటర్ మోనిటర్ పైన సిసి ఫుటేజీని మొబైల్ తో చిత్రీకరించిన వారిని గుర్తించాలని ఇఒ ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఆ వీడియోలను ఇఒ కు ఇవ్వవద్దంటూ ఆ సెక్షన్ తో పాటు కొండ మొత్తం మీద ఇంజనీరింగ్ సెకషన్ కు ఇంచార్జి గా ఉన్న ఈ ఈ కోటేశ్వరరావును బెదిరింపులకు గురి చేస్తున్నట్లు విశ్వాసనీయ సమాచారం. సిసి టివి రూములో ఏం జరిగిందనే వీడియోలను కనుక ఇఒ కు ఇస్తే మళ్లీ నగ్న చిత్రాలతో పేపర్లో వేయిస్తామని, లేదంటే భక్తుడి పైన కేసు నమోదు చేయించినట్లుగా ఈ ఈ కోటేశ్వరరావు పైన కూడా కేసులు నమోదు చేయిస్తామంటూ తీవ్ర స్థాయిలో ఎజైల్ సెక్యూరిటీ సంస్థ కు చెందిన కొందరు సిబ్బంది బెదిరింపులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో అసలు విషయాన్ని ఇఒ కు చెప్పలేక, అలా అని ఎజైల్ సెక్యూరిటీ సిబ్బందిని ఎదిరించలేక ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్న చందంగా మారిందని కొండమీద గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సిసిటివి రూములో ఏంజరిగిందో తెలియాలంటే నేరుగా ఇఒ శీనా నాయక్ రంగంలో దిగితేనే నిజాలు బయటకు వస్తాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

## ఏఐసీసీ జాతీయ సదస్సులో ఏపీ కాంగ్రెస్ న్యాయవాదులు

### ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన వల్లభనేని నాని, మన్నం రాజశేఖర్‌లు.



న్యూఢిల్లీ, ఆగస్టు 02(మనం న్యూస్): భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ న్యాయ, మానవ హక్కులు, సమాచార హక్కు విభాగం ఆధ్వర్యంలో శనివారం నాడు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో నిర్వహించిన రాజ్యాంగ సవాళ్లు, దక్పదాలు, మార్గాలు అనే జాతీయ సదస్సుకు దేశవ్యాప్తంగా ఉన్న న్యాయ నిపుణులు, మానవ హక్కుల ఉద్యమకారులు, రాజ్యాంగ పండితులు పాల్గొన్నారు. వల్లభనేని నాగ పవన్ కుమార్ (నాని), మన్నం రాజశేఖర్ మరికొందరు న్యాయవాదులు ఆంధ్రప్రదేశ్ నుండి ప్రతినిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వల్లభనేని నాగ పవన్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగం అంటే కేవలం పుస్తకపు నిబంధనలు కాదనీ, అది ప్రజల హక్కులకు బలమైన గోడ అని అన్నారు. ఈ గోడలో బిలములను పుట్టించాలనే కుట్రలు జరుగుతున్నాయన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు, రాజకీయ నాయకుడు, న్యాయ నిపుణుడు తన వంతు బాధ్యతను నిర్వహించాలని కోరారు. నేడు రాజ్యాంగం మీద గౌరవాన్ని ప్రజల హక్కులపై అవగాహన పెంచే కార్యక్రమాలు అత్యవసరం కాంగ్రెస్ పార్టీ ఈ బాధ్యతను నిబద్ధతగా నిర్వర్తిస్తుందన్నారు. ఏఐసీసీ న్యాయ విభాగం దేశవ్యాప్తంగా న్యాయవాదులలో చైతన్యం తీసుకువస్తోందన్నారు. నేడు జరుగుతున్న సమాచార హక్కు చట్టం ఉల్లంఘనలు ఎన్నికల కమిషన్ వారు నిర్వహిస్తున్న ఏక ధాటి పనితీరు చాలా బాధాకరమని ఆవేధన వ్యక్తం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడే కాంగ్రెస్ పార్టీ నేడు దేశంలో ప్రజాస్వామ్య ధ్రువీకరణకు మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. న్యాయ స్వతంత్రత ఆర్టిఐ హక్కు, మీడియా స్వేచ్ఛ, ఇవన్నీ రాజ్యాంగపు మూల స్తంభాలని అన్నారు. ఇవి ప్రస్తుతం ప్రమాధంలో పడ్డాయని ఆంధోళన వ్యక్తం చేశారు. మన్నం రాజశేఖర్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజల హక్కులు, సమానత్వం వంటి విలువలను సమాజంలో ప్రతి పౌరుడికి చాటి చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలది అని ఉద్ఘాటించారు. ఈ సమావేశం ఆ బాధ్యతను తీసుకుంటుందని తాను బావిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు రాష్ట్రాల ముఖ్య మంత్రులతో పాటు జాతీయ కాంగ్రెస్ నేతలు మల్లికార్జున్ ఖర్గే ,పార్లమెంట్ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తదితరులు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణలో కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్న బాధ్యతలను వివరించారని అన్నారు.

## విలువలు-విశ్వసనీయత లేని పార్టీ వైసీపీ

- నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య




నందిగామ టౌన్, ఆగస్టు 02(మనం న్యూస్): ఒక మహిళపై సభ్య సమాజం తలవంచుకునేలా నీచంగా మాట్లాడిన ప్రసన్నకుమార్ రెడ్డిని పరామర్శించేందుకు జగన్ హెలికాప్టర్ లో వచ్చి, అతడిని పక్కన పెట్టుకుని నిసిగ్గుగా ప్రభుత్వంపై నిందలు వేయడం చూసి మహిళలు సిగ్గుపడుతున్నారని ఎపి చీఫ్ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. శనివారం నాడు ఆమె తన కార్యాయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ విలువలు, విశ్వసనీయత లేని వైసీపీని చూసి ప్రజలు చీదరించుకుంటున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ నెల్లూరు టూర్ అట్టర్ ఫ్లాప్ అని అన్నారు. ఆఖరికి గ్రాఫిక్స్ తో నెల్లూరులో బంగారుపాళ్ళ చూపించుకోవాల్సిన దుస్థితికి దిగజారాడని అన్నారు. ఆస్తి కోసం తల్లి, చెల్లి మీద వేసిన కేసులో విజయం సాధించిన వీరుడిలా కనీసం మానవత్వం లేకుండా ప్రచారం చేసుకుంటున్న మనిషి జగన్మోహన్ రెడ్డి అని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ చెప్పేది ఒకటి, చేసేది ఒకటి అని అన్నారు. జగన్మోహన్ రెడ్డి దంపతులు ఇద్దరూ విలువలు, విశ్వసనీయత గురించి ఉపన్యాసాలు బాగానే ఇస్తారు కానీ అస్సలు పాటించరన్నారు. నిన్నటికి నిన్న నెల్లూరులో జనాలు రాలేదని బంగారుపాళ్యం టూర్లో ఉన్న విజువల్స్ సాక్షి టీవీలో చూపించి దిగజారుడుతనానికి పాల్పడతారా అని ప్రశ్నించారు. వైసీపీ నేతలకు మాత్రమే కుటుంబాలు ఉన్నట్లు, రాష్ట్రంలో ఎవరికీ కుటుంబాలు లేనట్టు జగన్మోహన్ రెడ్డి వాపోతున్నాడని అన్నారు. పల్నాడులో పట్టపగలు తోట చంద్రయ్య నరికి చంపారే, విశాఖలో డాక్టర్ సుధాకర్ ని మానసిక క్షోభ పెట్టి చంపారే, మద్యం మాఫియాను ప్రశ్నించినందుకు ఓంప్రకాష్ అనే వ్యక్తిని ఆత్మహత్య చేసుకునేలా హింసించారే వాళ్లకు కుటుంబాలు లేవా అని నిలదీశారు. వాళ్ళ కుటుంబాలను ఎందుకు పరామర్శించలేదు? కేవలం నీకు, నీ పార్టీ వాళ్లకు మాత్రమే కుటుంబాలు ఉన్నాయా జగన్మోహన్ రెడ్డి అని ప్రశ్నించారు. జగన్ రెడ్డి ఇకనైనా తీరు మార్చుకోకపోతే ప్రజాక్షేత్రంలో మనుగడ లేకుండా పోతుందని హెచ్చరించారు.

## కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ కేశినేని స్వాగతం



గన్నవరం, ఆగస్టు 02(మనం న్యూస్): గన్నవరం విమానాశ్రయంలో కేంద్ర రోడ్లు రవాణా జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ కేశినేని శివనాథ్ శనివారం నాడు గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. కొండపల్లి బొమ్మను బహుకరించారు. శనివారం మంగళగిరిలోని సీకె కన్వేన్షన్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రంలో జాతీయ రహదారులపై సమీక్ష సమావేశం, జాతీయ రహదారుల శంకుస్థాపన, పలు జాతీయ రహదారుల ప్రారంబోత్సవం,పలు మార్గాలు జాతికి అంకితం చేసే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు నితిన్ గడ్కరీ విజయవాడ నగరానికి వచ్చినట్లు సమాచారం.

## 'అన్నదాత సుఖీభవ' నిధుల బదిలీల్లో రైతుల ఖాతాల్లోకి 99%


### వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు



విజయవాడ సెంట్రల్, ఆగస్టు 02(మనం న్యూస్): విడుదల చేసిన అన్నదాత సుఖీభవ నగదు బదిలీ సర్దుబాటులో 99.98 శాతం రైతుల ఖాతాలలోకి నగదు జమ అయ్యి, విజయవంతంగా బదిలీ అయ్యిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు ఐఎఎస్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, మోడల్ కోడ్ అమలులో ఉన్న ప్రాంతాలలోని సుమారు ఒక లక్ష మంది రైతులకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తాత్కాలికముగా నిలిపివేసిన సుమారు ఒక లక్ష ఖాతాలు, యన్ పి సి ఐ లో చురుకుగా లేని , మ్యాపింగ్ కానీ సుమారు ఒక లక్ష మంది రైతుల ఖాతాలను మినహాయించి సుమారు 44.75 లక్షల ఖాతాలలోనికి డబ్బులు జమ అయ్యాయని ఆర్ టి జి ఎస్ ద్వారా తెలిసిందన్నారు. అందించిన డేటా లో కేవలం 1067 ఖాతాలకు మాత్రమే నగదు బదిలీ కాలేదన్నారు. అతి తక్కువ సమయంలో నాణ్యమైన రైతుల సమాచార డేటాను సేకరించి, ప్రభుత్వానికి అందించినందుకు తద్వారా 99.98 శాతం నిధులు రైతు ల ఖాతాలో బదిలీ అయ్యి జమ అవ్వడంలో సఫలం అయినందుకు ముఖ్యమంత్రి కార్యాలయం వ్యవసాయ శాఖ ను ప్రత్యేకముగా అభినందించింది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం పై జరిగిన కార్యక్రమం జయప్రదం చేసినందుకు రైతులకు, వివిధ ప్రజా ప్రతినిధులకు, జిల్లా కలెక్టర్లకు, ఇతర అధికారులకు ఢిల్లీ రావు ఐఎఎస్ ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 3 నుండి గ్రీవెన్స్ మాడ్యులు లో తిరస్కరణ లోనైన లబ్ధిదారులు నమోదుకు అవకాశం ఉందన్నారు. సిసి ఆర్ సి కార్డులున్న భూమి లేని రైతులకు అక్టోబర్ నెలలో నిధుల విడుదల చేస్తామన్నారు.

## 'పీఎం కిసాన్' పథకంతో రైతులకు ఆర్థిక భద్రత


- జిల్లాలో 1,18,629 మంది రైతులకు రూ. 80 కోట్ల 77లక్షల లబ్ది..
- ఎన్టీఆర్ జిల్లా జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.




ఇబ్రహీంపట్నం, ఆగస్టు 02(మనం న్యూస్): రైతుల ఆర్థిక స్థిరత్వానికి వ్యవసాయరంగ బలోపేతం చేయడానికి అన్నదాత సుఖీభవ - పి.యం. కిసాన్ పథకం ద్వారా అందించే ఆర్థిక సాయం ఎంతగానో దోహదం చేస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీశ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా జి. కొండూరు మండలం కవులూరు గ్రామంలో శనివారం జరిగిన అన్నదాత సుఖీభవ - పి.ఎం కిసాన్ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పాల్గొని లబ్దిదారులైన రైతులకు ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో రైతు పాత్ర కీలకమని, రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాయన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా సబ్బిడీ పై విత్తనాలు ఎరువులు పంపిణీ, పంట వేసేనాటికి అవసరమైన పెట్టుబడి సాయం, పండిరచిన ఉత్పత్తులకు కనీస మద్దతుధర కల్పించడం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయన్నారు. పీఎం కిసాన్ పథకం కింద మూడు విడతలగా 6000 రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతు కుటుంబానికి 14 వేల రూపాయలు కలిపి మొత్తంగా 20వేల రూపాయలను అందించడం జరుగుతుందన్నారు. మొదటి విడతగా జిల్లాలో 1,18,629 మంది రైతు కుటుంబాలకు రూ. 80 కోట్ల 77లక్షల లబ్ది చేకూర్చామన్నారు. రైతులకు ఆధునిక పరికరాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడమే కాకుండా డ్రోన్ల ద్వారా సాగుకు సహకారం అందిస్తున్నామన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. సేంద్రీయ వ్యవసాయం వైపు రైతులు మొగ్గుచూపాలన్నారు. అర్హత ఉన్న పతి రైతుకు ఈ పథకం ద్వారా లబ్ది చేకూరుతుందని, సాంకేతిక కారణాలతో ఎవరికైన అందకపోతే రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ లబ్దిదారులైన రైతులకు 20 కోట్ల 19 లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అందజేశారు.

# భద్రాద్రి జిల్లాకు రాష్ట్ర స్థాయి సంపూర్ణత అభియాన్ అవార్డ్

**గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 02 (మనంప్రతినిధి):** వెనుకబడిన జిల్లాల ప్రగతికి కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్ తీసుకొచ్చిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి సూచికలన్నింటినీ సమర్థంగా సాధిస్తూ రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా రాజ్ భవన్లో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలోరాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, రాష్ట్ర రవాణా శాఖ మరియు బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కు అవార్డు ప్రధానం చేశారు. నీతి అయోగ్ ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధిలో భాగంగా విద్య, ఆరోగ్యం, వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతులు, సామాజిక సంక్షేమం వంటి ఆరు ముఖ్య సూచికలపై 100 శాతం అభివృద్ధి లక్ష్యంగా సంపూర్ణత అభియాన్ కార్యక్రమం చేపట్టబడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఈ ఆరు సూచికలలో మూడు సూచికలపై శాతం సంపూర్ణత సాధించి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అంతేకాక, గుండాల మండలం బ్లాక్ స్థాయిలో ఐదు సూచికలను విజయవంతంగా పూర్తి చేసి ఆకాంక్షిత బ్లాక్లలో అగ్రస్థానంలో నిలిచింది. నీతి ఆయోగ్ అధికారి బృందాలు చేసిన సమీక్షల ఆధారంగా జిల్లా స్థాయిలో భద్రాద్రి కొత్తగూడెం ను అవార్డు కోసం ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ గారు మాట్లాడుతూ ఈ అవార్డు రావడం జిల్లాలోని అధికార యంత్రాంగం, మండల అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది మరియు ప్రజల చొరవకు గుర్తింపుగా నిలిచిందని అన్నారు. ప్రతి గ్రామానికీ అభివృద్ధి కల్పించాలన్న సంకల్పంతో అన్ని శాఖలు సమన్వయంతో పని చేశాయని, ప్రతి సూచికపై కట్టుదిట్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లడం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. ఈ అవార్డు మాకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. అభివృద్ధిలో స్థిరత్వం ఉండాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం. ముందుగానే ప్రణాళికలు రూపొందించి, సమర్థవంతంగా అమలు చేస్తే మరింత ప్రగతి సాధించవచ్చన్నారు. భవిష్యత్తులో జిల్లా మరిన్ని రంగాల్లో ఆదర్శంగా నిలబడేలా చర్యలు కొనసాగుతాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు.

# బాలల సదనం పిల్లలందరూ జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- చిన్నారులకు ఇస్రో ల్యాబ్ సందర్శనార్థం టూర్ కు ప్రణాళిక సిద్ధం చేయాలి
- బాల సదనంలోని పిల్లలకు ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, ఆగస్టు 2(మనం న్యూస్):** బాలల సదనంలో ఉన్న పిల్లలందరూ జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం ఖమ్మం నగరంలోని బాల సదనాన్ని కలెక్టర్ సందర్శించారు. బాలల సదనంలో సుందరీకరించిన ప్రాంగణాన్ని, వాలీబాల్, షటిల్ కోర్టు వద్ద ఆడుకునే ప్రదేశంలో రాళ్లు లేకుండా చూడాలని, ఇంకా మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. శిశుగృహలోని పసిపాపలతో కలెక్టర్ కాసేపు సరదాగా గడిపారు. బాలల సదనంకు అర్హులు ఎవరైనా పిల్లల దత్తత కోసం దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ పిల్లలను దత్తత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. శిశు గృహలో సంవత్సరం నిండిన చిన్నారి బర్త్ డే సందర్భంగా చిన్నారితో కలిసి జిల్లా కలెక్టర్ కేక్ కట్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, సి.డబ్ల్యూ.సి చైర్ పర్సన్ భారతరాణి లతో కలిసి కలెక్టర్ బాలల సదనం పిల్లలకు ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులు అందించడం ద్వారా భవిష్యత్తులో ఏదైనా అనారోగ్య పరిస్థితులు వస్తే ఆసుపత్రిలో మంచి వైద్యం ఉచితంగా అందుబాటులో ఉంటుందని అన్నారు. ప్రభుత్వం 10 లక్షల వరకు వైద్యానికి చెల్లిస్తుందని, ఆరోగ్య శ్రీ కార్డు జీవితాంతం ఉపయోగపడుతుందని అన్నారు. బాల సదనంలో ఉన్న ప్రతి ఒక్క పిల్లవాడికి సంబంధించి డాక్యుమెంట్, ఇతర రికార్డులు జాగ్రత్తగా లాకర్ లో భద్రపర్చాలని అన్నారు. బాల సదనం నుంచి వెళ్ళే సమయంలో పిల్లలకు వారి డాక్యుమెంట్లు పూర్తిగా ఒక ఫోల్డర్ లో పెట్టి అందించాలని అన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో కష్టాలు ఉంటాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కొని పోరాడాలని, మనం భయపడితే కష్టం ఇంకా భయపెడు తుందని, ధైర్యంగా ఉంటే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. చదువుతో మనకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన వసతుల కోసం ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను రెనోవేట్ చేస్తూ అక్కడ కౌన్సెలింగ్ చేసేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. బాలల సదనంలోని పిల్లలకు ఇస్రో ల్యాబ్ సందర్శనార్థం టూర్ వెళ్లేలా ప్రణాళిక తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.సి.డబ్ల్యూ.సి. చైర్ పర్సన్ భారత రాణి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాకు మంచి మనస్సు ఉన్న కలెక్టర్ లు రావడం మన అదృష్టం అని అన్నారు. యూ.పి.ఎస్.సి. పబ్లిక్ పరీక్షలో జిల్లా కలెక్టర్ ఆల్ ఇండియా మొదటి ర్యాంకు సాధించారని, కలెక్టర్ ను ఆదర్శంగా తీసుకొని పిల్లలు జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని అన్నారు.పిల్లలు జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలంటే చదువు ఒక్కటే మార్గమని, బాలసదనంలో ఉన్న ప్రతి ఒక్కరూ బాగా చదువుకోవాలని ఆమె సూచించారు. ప్రతి ఒక్కరూ సమాజానికి మేలు చేసేలా తయారు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, సి.డి.పి.ఓ., డిసిపిఓ విష్ణువందన, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పేదవాడికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు

- అంతర్గత సిసి రోడ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు, ఆగస్టు 2(మనం న్యూస్):** మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలో మంజూరైన 80 ఇళ్లకు గాను నాలుగు కోట్ల రూపాయల వ్యాయంతో నిర్మిస్తున్నటువంటి ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు .ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అర్హులైన ప్రతి పేదవాడికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. మంజూరు అయిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు నాలుగు దఫాలుగా తమ ఖాతాలోకి డబ్బులు పడతాయని ఈ సందర్భంగా తెలిపారు. మంజూరైనటువంటి లబ్ధిదారులు ఇందిరమ్మ ప్రభుత్వానికి ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు.

**40 లక్షల రూపాయల విలువ గల సిసి రోడ్లు ప్రారంభం**

మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలో సుమారు 40లక్షల రూపాయల తో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ మీరు ఎన్నుకున్న ఈ ఇందిరమ్మ ప్రభుత్వం, పేదవాడి ప్రభుత్వం అహర్నిశలు అభివృద్ధి సంక్షేమం వైపే నడుస్తుందన్నారు. పదేళ్ల ఏలుబడిలో కొత్త రేషన్ కార్డులు ఊసే లేదని, రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్క అర్హుడికి ఆరు కేజీల సన్న బియ్యం పథకం దేశానికి ఆదర్శమని, 200 యూనిట్ల కరెంటు, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, రైతుబంధు, రైతు బీమా, వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇలా ఎన్నో చెప్పుకోదగ్గ పథకాలను ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ముందుకు వెళ్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నరేష్ ,ఎంపీడీవో శ్రీనివాసరావు, ప్రభుత్వ అధికారులు, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మహిళా మండల అధ్యక్షురాలు సౌజన్య, పినపాక నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, మండల నాయకులు సుబ్బారెడ్డి, గాండ్ల సురేష్ , గణేష్ రెడ్డి, కొమరం రామ్మూర్తి, సాంబశివరావు, తమ్మిశెట్టి సాంబ, మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు స్థానికులు పాల్గొన్నారు

# పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

**ఎర్రుపాలెం, ఆగస్టు 02(మనం న్యూస్):** పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. ఎర్రుపాలెం మండలం తహసిల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్, శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి ములుగుమాడు రీ సర్వే ప్రక్రియ, రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన భూ సమస్యల దరఖాస్తుల స్థితిగతులు, భూ భారతి పోర్టల్ తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యల దరఖాస్తులపై నోటీసులు జారీ చేసి భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం వాటి పరిష్కారానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎర్రుపాలెం మండల తహసీల్దార్ ఉషా శారద, అధికారులు, పాల్గొన్నారు.

# పోలీసు అధికారులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సమీక్ష



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 02 (మనం ప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు ప్రాంగణంలోని సమావేశ మందిరంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్, శనివారం జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మాట్లాడుతూ, జైలులో ఉన్న ముద్దాయిల కేసులను దశలవారీగా , రోజువారిగా సాక్ష్యాలు ప్రవేశపెట్టి అంతిమ తీర్పులకు సహకరించాలని, వారెంట్లు ఉన్న పెండింగ్ కేసులు వెంట వెంటనే అమలు పరచాలని తెలిపారు. పాత పెండింగ్ కేసులలో సాక్ష్యాలను తీసుకొని రావాలని, నూతనంగా నమోదైన కేసులలో వెంటనే ఛార్జ్ షీట్స్ దాఖలు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి ఎస్. సరిత, ,ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కే. కిరణ్ కుమార్ , జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ ఏం. రాజేందర్ ,అదనపు సీనియర్ సివిల్ జడ్జి కర్నాటి కవిత, రెండవ అదనపు జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి. రవి కుమార్, జిల్లా ఎస్పీ బిరుదు రాజు రోహిత్ రాజు , ఏ.ఎస్పీ .విక్రమ్ కుమార్ సింగ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఏ పి పి లు,జిల్లాలోని డిఎస్పీలు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు ,సబ్ ఇన్స్పెక్టర్లు ఫారెస్ట్ అధికారులు ,ఎక్సైజ్ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, కోర్టు నోడల్ ఆఫీసర్, కోర్టు లైజాన్ ఆఫీసర్లు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాకు తిండి పెట్టండి సారూ..

## ఆకలితో అలమటిస్తున్న గిరిజన పాఠశాల విద్యార్థులు



**దమ్మపేట, ఆగస్టు 2 (మనం న్యూస్):** దమ్మపేట మండలం చీపురుగూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో నెల రోజులుగా సరైన తిండి లేక ఆకలితో అలమటిస్తున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుళ్ళిన అరటిపండ్లు ఇస్తున్నారని, భోజనం బాగాలేదని పడేస్తే తిడుతున్నారని ఆరోపించారు. మెనూ ప్రకారం కూడా భోజనం పెట్టడం లేదని, ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. **పిల్లలకు కడుపు నిండా భోజనం అందించాలి : మాజీ ఎమ్మెల్యే మెచ్చా** చీపురు గూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో నెల రోజులుగా సరైన తిండి లేక ఆకలితో అలమటిస్తున్న విద్యార్థులు పెట్టిన వీడియో సోషల్ వీడియోలో వైరల్ కావడంతో మాజీ ఎంఎల్ఏ మెచ్చా నాగేశ్వరరావు స్పందించారు. ప్రభుత్వ బడుల్లో చదువుకునే పేద విద్యార్థులకు సరిగ్గా అన్నం పెట్టడం చేతకాదు కానీ కాంగ్రెస్ నాయకుల జల్సాల కోసం వాళ్ళు తినే ఒక్కో ప్లేటు భోజనానికి లక్షన్నర ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. విద్యా రంగాన్ని నెంబర్ వన్ గా మార్చడం అంటే విద్యార్థుల కడుపులు మాడ్చడనమేనా అంటూ ప్రశ్నించారు. ఈ చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వంలో మాటలే తప్ప మ్యాటర్ ఏమీ లేదన్నారు .పరిపాలన చేతకాకపోతే రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ఆకాశంలో మెడలు కట్టడం మాని నేలపై ఆకలితో అలమటిస్తున్న విద్యార్థుల కడుపులు నింపాలని ఆయన అన్నారు.



# విద్యార్థుల వైద్య సంరక్షణ కోసం వైద్యశాల సౌకర్యం

**ఖమ్మం, ఆగష్టు 2(మనం న్యూస్):** శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ పోలీస్ సంక్షేమ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల వైద్య సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన (ఇన్ఫర్మేరీ రూమ్) వైద్యశాల గదిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్తో కలసి స్కూల్ చైర్ పర్సన్ నిష్ఠాశర్మ ప్రాభించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ పాఠశాలలో నాణ్యమైన విద్యకోసం అందిస్తున్న సదుపాయాలతో పాటు పాఠశాల సమయంలో చిన్న గాయాలు, ఆకస్మిక అనారోగ్య సమస్యలు, మెడికల్ అత్యవసర పరిస్థితులలో విద్యార్థులు ప్రాథమిక వైద్య సహాయం పొందే ముఖ్యమైన సౌకర్యాన్ని స్కూల్ అవరణలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపి కుమారస్వామి, ఏ ఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్ ఐ కామరాజు, యూనిట్ డాక్టర్ వేణుమాధవ్, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.

# ప్రతి కార్యాలయంలో 4(1)బి వివరాలు ప్రదర్శించాలి

- ఆర్టిఐ కమిషనర్ పి.వి. శ్రీనివాసరావు
- పారదర్శకంగా సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయాలి
- సామాన్యుడు చేతిలో వజ్రాయుధం ఆర్టిఐ చట్టం
- డిఎంఅండ్హెచ్ఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆర్టిఐ కమిషనర్



**ఖమ్మం, ఆగస్టు 02(మనం బ్యూరో):** ప్రతి కార్యాలయంలో 4(1)బి వివరాలు ప్రదర్శించాలని ఆర్టిఐ కమిషనర్ పి.వి. శ్రీనివాసరావు అన్నారు. కలెక్టరేట్ లోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి కార్యాలయాన్ని సమాచార హక్కు చట్టం కమిషనర్ పీ.వీ. శ్రీనివాసరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలోని ఆర్టిఐ సంబంధిత రిజిస్టర్ లను, వచ్చిన దరఖాస్తులను, పంపిన సమాధానాలను పరిశీలించారు. అనంతరం జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఇంటరాక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా ఆర్టిఐ కమీషనర్ పి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై గత కొన్ని రోజులుగా నిర్లిప్తత ఏర్పడినట్లు భావం అందరిలో వచ్చిందని, 2 సంవత్సరాల పాటు ఆర్టిఐ కమీషనర్ నియామకం కాకపోవడంతో 17 వేల కేసులు పెండింగ్ ఉన్నాయని అన్నారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కారం చేయడంతో పాటు అధికారులలో ఉన్న నిర్లిప్తత తొలగించాలనే ఉద్దేశ్యంతో జిల్లాల్లో పర్యటన చేపట్టామని అన్నారు. మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు పర్యటించామని అన్నారు. ఆర్టిఐ చట్టంపై జిల్లా అధికారులకు అవగాహన కల్పించామని అన్నారు. నేడు ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిణి కార్యాలయాన్ని పరిశీలించామని అన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా సమాచార అధికారి, సహాయ ప్రజా సమాచార అధికారి, మొదటి అప్పిలేట్ అథారిటీ ల పేర్లు, ఫోన్ నెంబర్ లతో కూడిన బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. 2005 పార్లమెంట్ ఆమోదించిన చట్టం ప్రకారం ప్రభుత్వ కార్యాలయంలో 4(1) బి చార్ట్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని, అటువంటి అంశాలను అధికారుల దృష్టికి తీసుకొని వస్తున్నామని అన్నారు. అధికారులు పారదర్శకంగా విధులు నిర్వహించాలని, ఎవరికి భయపడాల్సిన అవసరం లేకుండా ప్రజలు కోరిన సమాచారం నిర్ణీత సమయంలో అందించాలని అన్నారు. ఆర్టిఐ చట్టం ప్రకారం అవగాహనతో అమలు చేస్తే అక్రమాలు తగ్గిపోతాయని అన్నారు. సంతాన సాఫల్య కేంద్రాలలో జరుగుతున్న అక్రమాల గురించి ఇటీవల వార్తలు వస్తున్నాయని, సమాచార హక్కు చట్టం ప్రకారం జిల్లాలో ఎన్ని సంతాన సాఫల్య కేంద్రాలు ఉన్నాయి, వాటి రిజిస్ట్రేషన్ ప్రక్రియ, నిబంధనలు పాటిస్తున్నాయా వంటి సమాచారం ప్రజలు తెలుసుకోవచ్చని అన్నారు. ప్రజలు సమాచారం అధికంగా తెలుసుకోవడం వల్ల జరిగే మోసాల నుంచి తప్పించుకోవచ్చని అన్నారు. సామాన్యుడు చేతిలో వజ్రాయుధం ఆర్టిఐ చట్టం అని అన్నారు. జిల్లా అధికారులు సమాచార హక్కు చట్టాన్ని తప్పనిసరిగా పాటిస్తూ పారదర్శకంగా అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బసవతారకంలో జర్నలిస్టులకు వైద్య సేవలు అందించండి

- నామాకు టీయుడబ్ల్యూజె (ఐజెయు) వినతి



**ఖమ్మం, ఆగస్టు 2(మనం న్యూస్):** బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో జర్నలిస్టుల హెల్త్ కార్డు చెల్లుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు జర్నలిస్టులకు వీలైనంత మేర ఉచిత వైద్యం అందేలా చూడాలని టీయుడబ్ల్యూజె (ఐజెయు) ఆధ్వర్యంలో మాజీ ఎంపి బసవతారకం క్యాన్సర్ హాస్పటల్ ట్రస్టీ నామా నాగేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించారు. ఇటీవల కాలంలో క్యాన్సర్ సంబంధిత వ్యాధుల బారీన జర్నలిస్టు కుటుంబాలు పడుతున్న నేపథ్యంలో వైద్య ఖర్చులు భరించడం ఇబ్బందికరంగా మారిందని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించేలా చూడాలని జర్నలిస్టుల హెల్త్ కార్డు చెల్లుబాటయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన నామ ఈ విషయమై క్యాన్సర్ ఆసుపత్రి నిర్వాహకులతో మాట్లాడి జర్నలిస్టులకు బసవతారకం ఆసుపత్రి ద్వారా వీలైనంత మేర జర్నలిస్టు కుటుంబాలకు ఉచితంగా వైద్య సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, కౌన్సిల్ సభ్యులు సామినేని మురారి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, యూనియన్ నేతలు వనం వెంకటేశ్వర్లు, నలజాల వెంకటరావు, సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, వివిధ పత్రికలు , చానల్స్ బ్యూరోలు, యూనియన్ నేతలు మహేందర్, సత్యనారాయణ, మోహినుద్దీన్, నగర అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నామ పురుషోత్తం, నాయకులు కళ్యాణ్, ఏలూరి వేణుగోపాల్, మేడి రమేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 'సూపర్ సిక్స్' అమలు చేసే వరకు ప్రశ్నిస్తాం.. పోరాడుతాం


- రాష్ట్రంలో చంద్రబాబుది రివర్స్ గేర్ పరిపాలన
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ






**జగ్గయ్యపేట ఆగస్టు 2(మనం న్యూస్):** అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని వాగ్దా నాలుచేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అన్ని అమలు చేసే వరకు ప్రశ్నిస్తామని రాష్ట్రంలో చంద్రబాబు ఆధ్వర్యంలో రివర్స్ గేర్ పరిపాలన జరుగుతోందని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. సిపిఐ రాష్ట్ర మహాసభల్లో భాగంగా రెండవ రోజు శనివారం జరిగిన ప్రతినిధుల సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొనిమాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు ఆధ్వర్యంలో రివర్స్ గేరు పాలన సాగుతోంది అంటూ ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పిలుపు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలను 27 వేల కోట్ల రూపాయలను ప్రజలపై భారం వేసేందుకు సిద్ధమవుతున్నారు అన్నారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ఎన్నికలకు ముందు అన్న చంద్రబాబు ఇప్పుడు స్మార్ట్ మీటర్లు ఎందుకు బిగిస్తున్నారు అంటూ ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాని కి జి హుజూర్ అంటున్నాయని ,రాష్ట్రాన్ని ఆదానికి ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకమే కాక ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు కమ్యూనిస్టు పార్టీ తరఫున ప్రశ్నిస్తూనే ఉంటామని ప్రజా పోరాటానికైనా సిద్ధమని రామకృష్ణ హెచ్చరించారు. ఎన్నికలకు ముందు ప్రతి మహిళకు 15 వేలు ఇస్తానని వాగ్దానం చేసిన చంద్రబాబు ఎన్నికల తర్వాత ఆయన క్యాబినెట్ లోని ఓ మంత్రి మహిళలకు 15 వేలు ఇస్తే రాష్ట్రాన్ని అమ్మాల్సి వస్తుందని చెప్పటం దివాలా కోరుతనానికి నిదర్శనమని అన్నారు.

విద్యుత్ చార్జీల పైన స్మార్ట్ మీటర్ల పైన ఈ నెల 5వ తేదీన రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో విద్యుత్ స్టేషన్ల ముందు వామపక్షాల ఆధ్వర్యంలో భారీ నిరసనలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎన్నికలకు ముందు ఒక మాట ఎన్నికల తర్వాత ఒక మాట చెబుతున్న చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో రివర్స్ గేర్ పరిపాలన సాగుతోందని రామకృష్ణ విమర్శించారు. చంద్రబాబు కొత్తగా పి 4 అంటున్నారని ఈ పథకం ద్వారా రాష్ట్రాన్ని ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. దోచుకోవటానికి అన్ని అవకాశాలు ఇచ్చి కొంత సహాయం చేయండి అని అడగటం ఏంటంటే ప్రశ్నించారు. కార్పొరేట్ కంపెనీలకు రాష్ట్రంలోని భూములను దారాదత్తం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని అన్నారు.ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానం మేరకు రైతులకు 20 వేల రూపాయలను చెల్లించాల్సిందేనని రామకృష్ణ డిమాండ్ చేశారు. టమాటాలకు మద్దతు ధర లేదని గతంలో టమాటాలను రోడ్లపై పారపోసేవారని నేడు మామిడికాయలను సైతం రోడ్లపై పోసి నిరసన తెలియజేసే దుస్థితి రైతుకు వచ్చిందని రామకృష్ణ వాపోయారు. మద్యం స్కామ్ లో 3,500 కోట్లు అక్రమాలు జరిగాయని అంటున్నారని 11 కోట్లు దొరికాయనిచెబుతున్నారని మిగిలిన సొమ్ము కూడా ఎక్కడ ఉందో బయటకి తీయాలి అని డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీలు మారుతున్న రాజకీయ నేపథ్యంలో సంస్థ గతంగా బలపడాల్సిన అవసరం ఉందని అట్టడుగు స్థాయి నుంచి పార్టీ నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందని పార్టీని బలోపేతం చేసేందుకు కలసికట్టుగా కృషి చేద్దామని రామకృష్ణ పిలుపు ఇచ్చారు.



## అట్టడుగు వర్గాల అభివృద్ధే.. ఎన్డీఏ కూటమి లక్ష్యం

- పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

**తోట్లవల్లూరు, ఆగస్టు 02(మనం న్యూస్):** తోట్లవల్లూరు, పెనమకూరు గ్రామాలలో కొత్తగా వితంతు పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించిన పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 1 లక్షా 16 వేల నూతన వితంతు పెన్షన్లను పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల్లో తన నిబద్ధతను చాటుకుంటోందని అన్నారు. రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ, సంక్షేమ కార్యక్రమాలను విస్మరించకుండా పేద, అట్టడుగు వర్గాల జీవన ప్రమాణాలను ఉన్నతం చేయడానికి ఎన్డిఏ కూటమి ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేస్తోందన్నారు. పెన్షన్ ల పంపిణీ కార్యక్రమంలో జనసేనపార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్ వారితోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ రహదారుల్లో సమస్యలకు మోక్షం

### విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కృషి ఫలితం



**విజయవాడ తూర్పు, ఆగస్టు 02(మనం న్యూస్):** విజయవాడ - హైదరాబాద్ ఎన్.హెచ్- 65 లో ఆరు లైన్ల తో గ్రీన్ ఎక్స్ ప్రెస్ హైవే పనులు త్వరలోనే ప్రారంబించే విధంగా డిపిఆర్ సిద్దం చేస్తున్నట్లు కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించడానికి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) స్వాగతించారు. ఈ మేరకు ఎంపీ కేశినేని శివనాథ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళగిరిలోని సి. కె కన్వెన్షన్స్ లో 5వేల కోట్ల విలువ గల 27 జాతీయ రహదారి ప్రాజెకట్స్ ను ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయరహదారి-30 లో ఇబ్రహీంపట్నం-చంద్రగూడెం మార్గంలో టూ లైన్ ఆర్.వో.బి కి.మి 5+467 (ఆర్.హెచ్.ఎస్) కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేసినందకు ఎంపీ కేశినేని శివనాథ్ ధన్యవాదాలు తెలిపారు. ఒక కిలోమీటర్ పోడువు గల ఈ టూ లైన్ ఆర్.వో.బి కి రూ.36 కోట్లు కేటాయించారని, ఈ ఆర్.వో.బి నిర్మాణం పూర్తి అయితే ప్రజలకు ట్రావెలింగ్ టైమ్ తగ్గటంతో పాటు ప్రమాదాలు తగ్గుతాయన్నారు.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ విజయవాడ -హైదరాబాద్ మధ్య గ్రీన్ ఎక్స్ ప్రెస్ హైవ్ కి సంబంధించి డిపిఆర్ సిద్ధం చేయిస్తున్నట్లు ప్రకటించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ గ్రీన్ ఎక్స్ ప్రెస్ హైవే అంబర్ పేట నుంచి రత్నవరం, దాక్షవరం మీదుగా వెస్ట్ ఇబ్రహీం పట్నం వరకు రానుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో మరిన్ని అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నుంచి సాధ్యమైనంత ఎక్కువ నిధులు రాబట్టేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు.

## ఎన్టీఆర్ జిల్లాలో కొత్తగా 129 పోలింగ్ కేంద్రాలు

### ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీనరసింహం.



**విజయవాడ సెంట్రల్, ఆగస్టు 02 (మనం న్యూస్)** పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్లో భాగంగా జిల్లాలో కొత్తగా 129 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించామని, వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి ఎం. లక్ష్మీనరసింహం. రాజకీయ పార్టీలను కోరారు. స్థానిక కలెక్టరేట్లో శనివారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం. లక్ష్మీనరసింహం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ లక్ష్మీశ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘము ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026 (ఎస్ఐఆర్ 2026) ముందస్తు సన్నాహకములలో భాగంగా నిర్దేశించిన కార్యాచరణ ప్రణాళిక మేరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో జూలై 20వ తేదీన పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను అందజేశామన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 1200 ఓటర్లకు మించి ఉన్న యెడల సంబంధిత పోలింగ్ కేంద్రాన్ని హేతుబద్ధీకరించి కొత్తగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు, సమీప పోలింగ్ కేంద్రంలో విలీనం చేయాలని ఆదేశించారన్నారు. ప్రస్తుతం జిల్లా లో ఉన్న 1792 పోలింగ్ కేంద్రాలలో 295 పోలింగ్ కేంద్రాలలో 1200 మంది ఓటర్లు మించి ఉన్నారన్నారు. మించి ఉన్న ఓటర్లను సమీప పోలింగ్ కేంద్రంలో విలీనము చేసి కొత్తగా మరో 129 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన 129 పోలింగ్ కేంద్రాలతో జిల్లాలో మొత్తం పోలింగ్ కేంద్రముల సంఖ్య 1921 చేరిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 17,07,589 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో సగటు ఓటర్లు 889 గా నమోదై ఉన్నారని తెలిపారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉన్న యెడల ఈనెల 4వ తేదీ లోగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవడంతో పాటు పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ఈనెల 5 వ తేదీన ప్రచురించడం జరుగుతుందని డిఆర్వో లక్ష్మీనరసింహం తెలిపారు.

## పింగళి వెంకయ్యకు ఘన నివాళి




- నివాళులర్పించిన బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్

**విజయవాడ తూర్పు, ఆగస్టు 02(మనం న్యూస్):** దేశ వ్యాప్తంగా చేసుకోవాల్సిన పండుగ పింగళి వెంకయ్య జయంతి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు. శనివారం నాడు విజయవాడలోని బిజెపి పార్టీ కార్యాలయంలో పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా పింగళి వెంకయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పింగళా వెంకయ్య జాతీయ జెండా ఆవిష్కరించడం భగవంతుని ఇచ్చ అని అన్నారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ 19 సంవత్సరాల వయస్సులో బోరా యుద్ధంలో పాల్గొన్నారని తెలిపారు. ఎంతో నిబద్దత కలిగిన పింగళి వెంకయ్య మచిలీపట్నంలోని ఓ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేసారని తెలిపారు. యూనియన్ జాక్ కథ పింగళి వెంకయ్యను కదిలించిందన్నారు. నేషనల్ ఫ్లాగ్స్ ఆఫ్ డిఫరెంట్ నేషన్స్ అనే పుస్తకం పింగళి వెంకయ్య రచించారని పేర్కొన్నారు. 1921లో విజయవాడలో ఆయన త్రివర్ణ పతాకాన్ని మహాత్మాగాంధీకి బహూకరించారని తెలిపారు. కంబోడియా నుంచీ మేలి రకం పత్తి తీసుకొచ్చి పత్తి వెంకన్న గా పిలవబడ్డారని అన్నారు. చిట్టినగర్ లో తనకు కేటాయించిన స్థలంలోనే ఆయన జీవించారని తెలిపారు.

## కొత్త రేషన్ కార్డుల కోసం పేదల నిరీక్షణ




- పేదల ఆశలను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**తుర్కయంజాల్ ఆగస్టు 2 ( మనం న్యూస్ ):** ప్రతి నిరుపేద కుటుంబానికి ఆహార భద్రత కల్పించాలన్న సంకల్పంతో ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని జేఎంఆర్ ఫంక్షన్ హాల్ లో అబ్దుల్లాపూర్మెట్ మండలం తాసిల్దార్ సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో రాగన్నగూడ, మన్నెగూడ, తుర్కయంజాల్, ఇంజాపూర్, తొర్రూర్, మునగనూర్, అన్ని వార్డులకు అర్హులైన లబ్ధిదారులకు కమిషనర్ అమరేందర్ రెడ్డి, ఎమ్మార్వో సుదర్శన్ రెడ్డి తో, కలిసి ఎమ్మెల్యే చేతుల మీదుగా రేషన్ కార్డుల ప్రోస్టింగ్ కాఫీలను అందించడం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా నిర్దేశించిన ప్రజా ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను జారీ చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి పేదవాడు రేషన్ కార్డు ద్వారా సన్నబియ్యం తీసుకుని కడుపునిండా అన్నం తినాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దొడ్డు బియ్యాన్ని నిషేధించి పేదవారికి సన్న బియ్యం పథకాన్ని శ్రీకారం చుట్టాడు. ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు వచ్చే విధంగా చూస్తామని మున్సిపల్ పరిధిలో వార్డ్ ఆఫీసర్లు ఇంటింటికి వెళ్లి అర్హులైన వారికి రేషన్ కార్డులు పంపిణీ చేయాలన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీలో 100 కోట్లతో, సిసి రోడ్లు, వరద కాలువల పనులు, డ్రైనేజీలు, నిర్మాణ పనులు ముమ్మరంగా చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. 500 కు సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రెండు లక్షల రుణమాఫీ, దేశంలో ఎక్కడ ఏ ప్రభుత్వం చేయని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసినట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్ టి పి సి సి రాష్ట్ర కార్యదర్శి కొత్త కుర్మా శివకుమార్, టి పి సి సి సభ్యులు కాకుమాను సునీల్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్త కుర్మా మంగమ్మ శివకుమార్, మాజీ కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య, మర్రి మాధవి మహేందర్ రెడ్డి, రేవల్ల హరిత యాదగిరి, మేతరి అనురాధ దర్శన్, కంబాలపల్లి ధనరాజ్, నక్క శివలింగం గౌడ్, బండారి బాలరాజ్, కుంట ఉదయశ్రీ గోపాల్ రెడ్డి, నాయకులు సామ భీం రెడ్డి, కొంతం వెంకట్ రెడ్డి (జానీ ), ఒర్సు శ్రీనివాస్, బొక్క వంశిధర్ రెడ్డి, డాక్టర్ రాగ్యా నాయక్, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

## ముగ్గురు మావోయిస్టుల అరెస్ట్

**చర్ల, ఆగస్ట్ 2 (మనం న్యూస్) :** ఛత్తీస్ఘడ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా కేరళపాల్ అటవీప్రాంతంలో ఇద్దరు రివార్డు కలిగిన మావోయిస్టులతో పాటు మొత్తం ముగ్గురిని భద్రతా బలగాలు అరెస్ట్ చేశాయి. అరెస్టయిన వారిలో రెండు లక్షల రివార్డు కలిగిన మిలీషియా కమాండర్ పొడియం నంద, మిలీషియా సభ్యులు హేమ్లా జోగ, హేమ్లా గంగ ఉన్నారు. వీరి వద్ద నుండి మూడు కిలోల బరువున్న రెండు టిఫిన్ బాంబులు, మూడు డిటోనేటర్లు, రెండు మీటర్ల కార్డెక్స్ వైర్, రెండు జిలిటెన్ స్టిక్స్, 18 మీటర్ల విద్యుత్ వైర్, రెండు బ్యాటరీలను స్వాధీన పరుచుకున్నారు. అరెస్ట్ అయిన వారిని కోర్టులో రిమాండ్ చేసారు.

## అత్యధిక పాల ఉత్పత్తిదారులకు సన్మానం

### రైతులను సత్కరించిన ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు




**విజయవాడ సెంట్రల్, ఆగస్టు 02(మనం న్యూస్):** శనివారం సెంట్రల్ నియోజకవర్గం లోని 64వ డివిజన్ కుందా వారి కండ్రిక సొసైటీ వద్ద కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు లాంచనంగా ప్రారంభించారు. అన్నదాత సుఖీభవ' పథకం కింద రైతులకు పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు రైతులకు అన్నదాత సుఖీభవ పి యం కిసాన్ నగదు చెక్కులను అందజేసి రైతులకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నదాత సుఖీభవ, పి యం కిసాన్ కార్యక్రమం ద్వారా లక్షలాదిమంది రైతులకు లబ్ధి చేకూర్చేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని, రాష్ట్ర అభివృద్ధి చూసి ఓర్వలేని తనంతో వైయస్సార్సీపి నాయకులు రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసి తద్వారా ప్రజా ప్రయోజనాలను కాలరాస్తున్నారు అని అన్నారు. రైతుల శ్రేయస్సుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 14000, కేంద్ర ప్రభుత్వం ఆరువేలు కలిసి ఏడాదికి 20,000 చొప్పున ఆర్థిక సహాయం రైతులకు అందిస్తున్నామని, పథకం ప్రారంభం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 46 ,85,838 రైతులకు లబ్ధి చేకూరుస్తున్నామని, రాష్ట్ర అభివృద్ధిని చూసి పులివెందుల ఎమ్మెల్యే జగన్ ఓర్వలేక పోతున్నారని, రాష్ట్రంలో పెట్టుబడిల కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు సింగపూరు, తదితర దేశాలలో పర్యటన చేస్తున్నారనీ, పెట్టుబడులు రాకుండా కంపెనీలకు వైఎస్ఆర్సీపి కి చెందిన వ్యక్తులు బెదిరింపు మెయిల్స్ పంపుతున్నారన్నారని అన్నారు.

## పాఠశాలలను సందర్శించిన మాజీఎమ్మెల్సీ నర్సిరెడ్డి

**రంగారెడ్డి, ఆగస్టు 2 (మనం న్యూస్):** బహుదూర్పుర మండలంలో పాఠశాలలను మాజీఎమ్మెల్సీ నర్సిరెడ్డి శనివారం తెలంగాణ పౌరస్పందన వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర పాఠశాల కసారట , దారుల్ షిఫా ప్రభుత్వ అందుల పాఠశాలను సందర్శించడం జరిగింది. పాఠశాలలో సమస్యలను తెలుసు కున్నారు. నర్సిరెడ్డి తో పాటు పౌర స్పందన వేదిక సభ్యులు రాధేశ్యామ్ , ప్రభుత్వ అందుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు జావేద్ అహ్మద్ , రవి కాంత్, శాంతమ్మ పాల్గొనడం జరిగింది.



## కెనాల్ కాల్వ పూడికతీత పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



**రాయపర్తి, ఆగస్టు 2 (మనం న్యూస్):** మండలంలోని తిరుమలాయపల్లి గ్రామ సమీపంలోని మంచినీళ్ల చెరువులోకి వచ్చే ఎస్సారెస్పీ ఫిడర్ కాలువ పూర్తిగా కూడిపోయి పిచ్చి మొక్కలతో ముళ్ళపొదలతో కూరుకుపోగా, నీటిపారకంతో ఇబ్బందులు వస్తున్నాయని రైతులు ఎమ్మెల్యే కు విన్నవించుకోగా స్పందించి శనివారం పూడికతీత పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ నాయకులు రైతులకు ఏదో మేలు చేసినట్టుగా ఉన్నారే తప్ప, రైతులను ఏనాడు పట్టించుకోలేదని పట్టించుకున్నట్లయితే కాలువలు ఈ విధంగా ఉండేవి కావని , ఎప్పటికప్పుడు ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి, కూడిపోయిన కాలువలను పునరుద్ధరించడానికి బడ్జెట్ అంచనాలు వేశామని, భాగంగానే ఒక రాయపర్తి మండలానికి కోటి రూపాయలు మంజూరు అయ్యాయని, కొన్నిచోట్ల మా సొంత ఖర్చులతో కూడికతీత పనులు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్య నాయక్, మాజీ టీపీసీసీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, కృష్ణమాచార్యులు, ఉల్లెంగుల నరసయ్య, ఆకుల సురేందర్రావు, కాంచనపల్లి వనజారాణి, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, చెవ్వు కాశీనాథం, మచ్చ రమేష్, అఫ్రోజ్ ఖాన్, పిరని ప్రవీణ్ ఇరిగేషన్ అధికారులు కిరణ్, బాలదాసు తదితరులు పాల్గొన్నారు.


## శ్రీ మహాత్మా హైస్కూల్లో ఘనంగా బోనాల ఉత్సవాలు




**రాయపర్తి ఆగస్టు 2 (మనం న్యూస్):** మండల కేంద్రంలోని శ్రీ మహాత్మా హైస్కూల్లో శనివారం ముందస్తు బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి, మట్టి కుండలో బోనం వండి వేపాకు పసుపు కుంకుమలతో అలరించిన తలపై పెట్టుకొని పోతరాజులు శివసత్తులు వెంటరాగా నృత్యాలు చేస్తూ విద్యార్థులు ఆటపాటలతో మారెమ్మ వరకు బోనాలు ఎత్తుకొని పోయి దైవ దర్శనం చేసుకున్నారు. విద్యార్థులు వివిధ వేషాధారణాలు ధరించి పలువురిని ఆకట్టుకున్నారు.అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు డాన్సులతో పాటలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సరికొండ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాల పట్ల అవగాహన కోసం ఇలాంటి కార్యక్రమాలు పాఠశాలలోఏర్పాటు చేస్తున్నామని, తెలంగాణ పండుగలు వాటి ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కుంట రమేష్, పాఠశాల ఇన్చార్జి కిరణ్, ఉపాధ్యాయులు దయాకర్, పండరినాథ్, మహేందర్, కపిల్, స్మిజా, అనిత, షమ్మీ, రజిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# పన్నెండేళ్ల అమ్మాయికి ప్రపంచ స్విమ్మింగ్ కాంస్యం

పన్నెండేళ్ల వయసుకే అంతర్జాతీయ స్థాయిలో అదరగొడుతున్న చైనా యువ స్విమ్మర్ యు జిడి.. ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ లో బోణీ కొట్టింది. ఈ పోటీల్లో ఆమెకు కాంస్యం దక్కింది. 4స200 మీటర్ల ఫ్రీస్టైల్ రిలే రేసులో మూడో స్థానం సాధించిన చైనా బృందంలో జిడి సభ్యురాలు.



క్వాలిఫయింగ్ లో పోటీ పడ్డ జిడి.. ఫైనల్లో బరిలోకి దిగలేదు. కానీ ఆమె జట్టు కాంస్యం గెలవడంతో తనకూ పతకం దక్కింది. 200 మీ. బటర్ ఫ్లై, 200 మీ. వ్యక్తిగత మెడ్లీ రేసుల్లో జిడి త్రుటిలో పతకం చేజార్చుకుంది. ఈ రెండు రేసుల్లోనూ ఆమె నాలుగో స్థానంలో నిలిచింది. జిడి 400 మీ. వ్యక్తిగత మెడ్లీ రేసులో బరిలోకి దిగాల్సి ఉంది.

# శతక్కొట్టిన జైస్వాల్..



ఇంగ్లండ్ తో ఐదో టెస్టులో టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్ శతక్కొట్టాడు. ఓవల్ మైదానంలో శనివారం నాటి మూడో రోజు ఆటలో భాగంగా వంద పరుగుల మార్కును అందుకున్నాడు. 127 బంతుల్లోసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతడి శతక ఇన్నింగ్స్ లో 11 ఫోర్లు 2 సిక్సర్లు ఉన్నాయి. ఇక ఈ సిరీస్ లో జైసూకు ఇది రెండో శతకం. అంతకు ముందు లీడ్స్ వేదికగా తొలి టెస్టులో జైస్వాల్ 101 పరుగులు చేశాడు. కాగా ఆండర్సన్- టెండుల్కర్ ట్రోఫీ లో భాగంగా ఐదు టెస్టుల సిరీస్ లో ఇంగ్లండ్ టీమిండియాపై 2-1తో ఆధిక్యంలో ఉంది. ఈ క్రమంలో సిరీస్ ఫలితాన్ని తేల్చే ఆఖరిదైన ఐదో మ్యాచ్ లండన్ లో గురువారం మొదలైంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ కు దిగిన భారత్ మొదటి ఇన్నింగ్స్లో 224 పరుగులకు ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్ లో జైస్వాల్ రెండు పరుగులు మాత్రమే చేసి అవుటయ్యాడు. ఇంగ్లండ్ పేసర్ గస్ అట్కిన్సన్ బౌలింగ్ లో ఎల్బీడబ్ల్యూ అయ్యాడు. అయితే, రెండో ఇన్నింగ్స్ కు వచ్చే సరికి జైస్వాల్ గేరు మార్చాడు. శుక్రవారం నాటి రెండో రోజు ఆటలోనే అర్ధ శతకం (52₹) పూర్తి చేసుకున్న ఈ ఎడమచేతి వాటం బ్యాటర్.. శనివారం దానిని సెంచరీగా మలిచాడు.

తద్వారా ఈ సిరీస్ లో రెండో శతకంతో పాటు.. తన టెస్టు కెరీర్ లో ఆరో సెంచరీని నమోదు చేశాడు. ఇందులో నాలుగు ఇంగ్లండ్ మీద బాదినవే కావడం మరో విశేషం. ఇదిలా ఉంటే.. 75/2 ఓవర్ నైట్ స్కోరుతో శనివారం ఆట మొదలుపెట్టిన టీమిండియా 51 ఓవర్ల ఆట పూర్తయ్యేసరికి నాలుగు వికెట్ల నష్టానికి 216 పరుగులు చేసింది. నైట్ వాచ్ మన్ ఆకాశ్ దీప్ అర్ధ శతకం(66)తో చెలరేగగా.. కెప్టెన్ శుబ్ మన్ గిల్ (11) మాత్రం నిరాశపరిచాడు. జైసూతో కలిసి కరుణ్ నాయర్ (9₹) పరుగులతో క్రీజులో ఉన్నాడు. కాగా భారత్ ను తొలి ఇన్నింగ్స్ లో 224 పరుగులకు కట్టడి చేసిన ఇంగ్లండ్.. తమ మొదటి ఇన్నింగ్స్ లో 247 పరుగులకు ఆలౌట్ అయింది.

# భారత ఫుట్‌బాల్ కోచ్‌గా జమీల్

భారత పురుషుల ఫుట్ బాల్ జట్టుకు చీఫ్ కోచ్ గా ఖలీద్ జమీల్ ఎంపికయ్యాడు. చీఫ్ కోచ్ రేసులో స్టీఫెన్ కాన్ స్టంటైన్, స్టెఫాన్ టర్కోవిచ్ లను వెనక్కి నెట్టిన 48 ఏళ్ల జమీల్ ను అత్యున్నత పదవి వరించింది. దిగ్గజ ఆటగాడు విజయన్



సారథ్యంలోని ఏఐఎఫ్ఎఫ్ సాంకేతిక కమిటీ ముగ్గురి పేర్లతో జాబితాను తయారు చేయగా.. మాజీ అంతర్జాతీయ ఆటగాడు జమీల్ కు ఎగ్జిక్యూటివ్ కమిటీ పచ్చజెండా ఊపింది. కాన్ స్టంటైన్ భారత జట్టు మాజీ చీఫ్ కోచ్ కాగా.. స్లొవేకియా జాతీయ జట్టుకు టర్కోవిచ్ సేవలు అందించాడు. జాతీయ జట్టుకు భారతీయుడు చీఫ్ కోచ్ గా నియమితుడవటం 13 ఏళ్లలో ఇదే తొలిసారి. పురుషుల జట్టుకు ప్రధాన కోచ్ గా పనిచేసిన చివరి భారతీయుడు సావియో మెదీరా. 2011 నుంచి 2012 వరకు అతను చీఫ్ కోచ్ గా వ్యవహరించాడు. 2017 ఐ-లీగ్ లో ఐజ్వాల్ ఫుట్ బాల్ క్లబ్ ను జమీల్ విజేతగా నిలిపాడు. ప్రస్తుతం ఇండియన్ సూపర్ లీగ్ లో జంషెడ్ పుర్ ఎఫ్ సీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు.

# ఊహించని ట్విస్ట్ ఇచ్చిన సైనా నెహ్వాల్

భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ అభిమానులకు శుభవార్త చెప్పింది. భర్త పారుపల్లి కశ్యప్తో కలిసి దిగిన ఫొటోను పంచుకుంటూ.. ''దూరం దగ్గర చేసింది'' అని క్యాప్షన్ ఇచ్చింది. తద్వారా తాము తిరిగి కలిసిపోయామనే సంకేతాలు ఇచ్చింది.



కాగా భర్త పారుపల్లి కశ్యప్ తో తాను విడిపోతున్నట్లు సైనా నెహ్వాల్ గత నెలలో ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. సుదీర్ఘంగా చర్చించిన తర్వాతే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు జూలై 13న సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది.

**ఆలోచించే విడాకుల నిర్ణయం**

''జీవితం మనల్ని ఒక్కోసారి వేర్వేరు దిశల్లో ప్రయాణించేలా చేస్తుంది. సుదీర్ఘ చర్చలు, ఆలోచనల అనంతరం నేను, కశ్యప్ విడిపోవాలని నిశ్చయించుకున్నాం. ఈ బంధంలో నాకెన్నో మధురానుభూతులు ఉన్నాయి. ఇకపై కూడా మేము స్నేహితుల్లా కొనసాగుతాం'' అని సైనా నోట్ విడుదల చేసింది.

**ఊహించని ట్విస్ట్**

అయితే, తాజాగా శనివారం పారుపల్లి కశ్యప్ తో కలిసి దిగిన ఫొటోలను సైనా నెహ్వాల్ ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. ''కొన్నిసార్లు దూరమే.. మన సన్నిహితులతో కలిసి ఉండటం ఎంత విలువైనదో నేర్పుతుంది. మేము కలిసి ఉండేందుకు మరో ప్రయత్నం చేస్తున్నాం'' అని రెండు హార్ట్ ఎమోజీలతో సైనా క్యాప్షన్ జతచేసింది.

కాగా భారత బ్యాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపీచంద్ దగ్గర శిక్షణ తీసుకున్న సైనా, కశ్యప్ చాలా ఏళ్లపాటు ప్రేమించుకున్నారు. 2018లో పెళ్లి బంధంతో ఒక్కటైన వీరు అన్యోన్యంగా ఉండేవారు. కెరీర్ పరంగానూ ఒకరికొరు అండగా ఉంటూ కపుల్ గోల్స్ సెట్ చేసేవాళ్లు. అయితే, సైనా విడాకుల ప్రకటన చేయగా.. కశ్యప్ మాత్రం అపుడు స్పందించలేదు.

ఇక ఇప్పుడు భార్యతో కలిసి పోస్ట్ షేర్ చేస్తూ తమ రీయూనియన్ ని మాత్రం తెలియజేశాడు. కాగా లండన్ ఒలింపిక్స్-2012లో మహిళల సింగిల్స్ విభాగంలో సైనా కాంస్యం గెలవగా.. అదే ఎడిషన్ లో కశ్యప్ పురుషుల సింగిల్స్ లో క్వార్టర్ ఫైనల్స్ కు చేరుకున్నాడు.

# స్టైల్ అండ్ స్వాగ్‌తో తలైవా విశ్వరూపం..

తమిళ ప్రేక్షకులతో పాటు యావత్ దేశవ్యాప్తంగా సూపర్ స్టార్ రజినీకాంత్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కూలీ ట్రైలర్ వచ్చేసింది. దర్శకుడు లోకేష్ కనగరాజ్ నుంచి వస్తున్న ఈ సినిమా మరోసారి తమిళ సినీ రికార్డులను తిరగరాయడం ఖాయమని ఈ ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ప్యూర్ మాస్ అండ్ యాక్షన్ ఎలిమెంట్స్ తో ఈ ట్రైలర్ కట్ అదిరిపోయింది.




ఇక తలైవా రజినీకాంత్ తనదైన స్వాగ్ తో చేసే యాక్షన్ ఫ్యాన్స్ కు ఫుల్ మీల్స్ అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఈ ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. లోకేష్ తనదైన మార్కో కట్ చేసిన ఈ ట్రైలర్ ప్రేక్షకులకు కన్నులపండువగా అనిపిస్తుంది. భారీ క్యాస్టింగ్, అనిరుద్ ఎంగేజింగ్ మ్యూజిక్ తో ట్రైలర్ ఆద్యంతం పవర్ ప్యాక్డ్ గా కట్ చేశారు. రజినీకాంత్ ఎలివేషన్ పీక్స్ లో ఉండటంతో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.

మొత్తానికి రజినీకాంత్ ఈసారి ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను షేక్ చేసేందుకు చాలా గట్టిగానే వస్తున్నాడనేది ఈ ట్రైలర్ తో కన్ఫమ్ అయింది. ఈ సినిమాలో ఉపేంద్ర, నాగార్జున, శ్రుతి హాసన్, సత్యరాజ్, అమీర్ ఖాన్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రొడ్యూస్ చేస్తుండగా ఆగస్టు 14న వరల్ వైడ్ గా గ్రాండ్ రిలీజ్ కానుంది.

# చెప్పు తెగుద్ది.. అంటూ అనసూయ మాస్ వార్నింగ్



టాలీవుడ్ బుల్లితెరపై తన హోస్టింగ్ ట్యాలెంట్ తో పాటు గ్లామర్ తో తనకంటూ ప్రత్యేక క్రేజ్ తెచ్చుకున్న భామ అనసూయ. ఆ తర్వాత ఆమె సినిమాల్లోనూ తన వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయితే, సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్ గా ఉండే అనసూయ చాలా వివాదాల్లోనూ హాట్ టాపిక్ గా మారింది.

కాగా ఇప్పుడు మరోసారి అనసూయ చేసిన కొన్ని కామెంట్స్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. ప్రకాశం జిల్లాలోని మార్కాపురంలో ఓ షాపింగ్ మాల్ ఓపెనింగ్ కు అనసూయ గెస్ట్ గా వచ్చింది. అక్కడ ఆమె స్టేజీపై మాట్లాడుతుంటే, కింద ఉన్న జనంలో కొందరు ఆకతాయిలు ఆమెపై కొన్ని కామెంట్స్ చేశారు. దీంతో అనసూయ కోపంతో రగిలిపోయింది.


వెంటనే చెప్పు తెగుద్ది.. పబ్లిక్ లో అందరి ముందు చెప్పుతో కొట్టడానికి కూడా తాను వెనకాడనని.. మీ ఇంట్లో ఉండే తల్లి, అక్క, చెల్లి లను కూడా ఇలాంటి కామెంట్స్ చేస్తారా.. అంటూ సదరు ఆకతాయిలపై ఫైర్ అయింది. ఆమె చేసిన కామెంట్స్ వీడియో రూపంలో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# ముందే వచ్చేసిన ఓజీ సాంగ్.. అన్ని లెక్కలు తేల్చనున్న పవర్ స్టార్


పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్ గా దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన భారీ చిత్రం ఓజీ. ఈ సినిమాపై ఉన్న అంచనాలు కోసం ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఆ రేంజ్ హైప్ దీనిపై ఉంది. మరి ఈ సినిమా నుంచి మోస్ట్ అవైటెడ్ గా ఉన్న ఫస్ట్ సాంగ్ ఫైర్ స్ట్రాం ఈజ్ లిరికల్ వీడియోని మేకర్స్ నేడు సాయంత్రం విడుదల చేస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు.

కానీ ట్విస్ట్ ఇస్తూ మధ్యాహ్నామే రిలీజ్ విడుదల చేసేసారు. మరి ఈ సాంగ్ మాత్రం నెక్స్ట్ లెవెల్లో ఉందని చెప్పాలి. సుజీత్ టేకింగ్, పవన్ స్క్రీన్ ప్రెజెన్స్ సాంగ్ లో అదిరిపోయాయి. ఇక థమన్ కూడా అదే రీతిలో క్రేజీ డ్యూటీ చేసాడని చెప్పాలి. టాలీవుడ్ జాన్ విక్ స్టైల్ లో తన మార్క్ బీట్స్ తో థమన్ దుమ్ము లేపాడని చెప్పాలి.

ఇక వీటితో పాటుగా మధ్యలో జాపనీస్ ర్యాప్ ఇంకో హైలైట్ అని చెప్పాలి. అంతే కాకుండా సినిమా నుంచి వచ్చిన హంగ్రీ చీతాకి ఓ స్పెషల్ వెర్షన్ ని కూడా ప్లాన్ చేయడం మరింత క్రేజీగా ఉందని చెప్పాల్సిందే. మొత్తానికి మాత్రానికి మాత్రం ఓజి తో పవన్ కళ్యాణ్ అన్ని లెక్కలూ తేల్చేలానే ఉన్నారని చెప్పి తీరాలి.



# ఎన్టీఆర్ అన్న కోసం మా మూవీ టైటిల్ మార్చుకున్నాం: విజయ్ దేవరకొండ



'కింగ్డమ్' మూవీకి తొలుత 'నాగ దేవర' అనే టైటిల్ అనుకున్నామని, ఎన్టీఆర్ 'దేవర' కోసం ఆ టైటిల్ వదులుకున్నామని కథానాయకుడు విజయ్ దేవరకొండ అన్నారు. ఆయన కీలక పాత్రలో గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ మంచి టాక్ ను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా శనివారం విజయ్ దేవరకొండ విలేకరులతో మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

● ''కింగ్డమ్' విషయంలో ఒత్తిడి ఉన్న మాట వాస్తవమే. ఇదే కాదు, ప్రతి సినిమాకు నాకు ఒత్తిడి ఉంటుంది. ఇంతకుముందు చేసిన సినిమా హిట్ అయిందని ప్రశాంతంగా కూర్చోలేం కదా. ఇది విజయం సాధిస్తే, తర్వాత సినిమాకు రిలాక్స్ అయిపోలేం కదా. 'కింగ్డమ్'కు తెలుగుతో పాటు, తమిళంలో మంచి ఆదరణ దక్కుతోంది''

● ''ఈ మూవీలో అనేక పార్శ్వాలు ఉన్నాయి. ఈ కథను నాకు చెప్పిన తర్వాత దీనిని మూడు గంటల్లో చెప్పటం కష్టమనిపించింది. మొదటి పార్ట్ లో సూరి జర్నీ మాత్రమే చూపించాం. ముఖ్యంగా అన్నను వెతుక్కుంటూ ఎలా వెళ్లాడన్నది మాత్రమే తీశాం. అయితే, చివరి 20 నిమిషాల్లో సూరి లక్ష్యం మారిపోతుంది. ఒక కానిస్టేబుల్ కథతో మొదలై రాజు అవడంతో ఈ భాగం ముగిసింది''

● ఈ కథ వినగానే రిఫరెన్స్ కోసం 'వైకింగ్స్', 'ది లాస్ట్ కింగ్డమ్' వంటి సిరీస్ లు వరుసగా చూశా. ఇక కానిస్టేబుల్ కనిపించే తొలి సన్నివేశాల్లో చాలా సన్నగా కనిపిస్తా. 'ఫ్యామిలీస్టార్' చేయడానికి ముందు కొన్ని రోజుల పాటు చేసిన షెడ్యూల్ అది. ఆ తర్వాత స్ట్రీగా, పోరాట యోధుడిగా కనిపించేందుకు ఆరు నెలలు ప్రత్యేక కసరత్తులు చేశా''


● ''కింగ్డమ్' పార్ట్2'లో కచ్చితంగా స్టార్ హీరో ఉంటారు. అయితే, సోషల్ మీడియాలో 'రానా' అంటూ జరుగుతున్న చర్చలో నిజం లేదు. ఎవరనేది దర్శకుడు గౌతమ్ చెబుతారు.

● ''నెగిటివిటీ గురించి నేను పెద్దగా ఆలోచించను. అది చాలా సాధారణమైంది. దాని గురించి నాకు ఎలాంటి కంప్లయింట్స్ లేవు. 10ఏళ్ల కిందట నేను ఎవరికీ తెలియదు. ఇంత మంది మనల్ని చూడటానికి వస్తున్నారంటే అది నా అదృష్టం. అభిమానులు, ప్రేక్షకులు పంచే ప్రేమ అది''

● ''అర్జున్ రెడ్డి'కి బెస్ట్ యాక్టర్ అవార్డు తీసుకున్నప్పుడు గర్వంగా అనిపించింది. ఆ మూవీ ఆడియో ఫంక్షన్ కు వందల మంది వచ్చారు. మనకోసం వస్తున్న వారి కోసం ఏదైనా చేయాలనిపించింది. నాకు వచ్చిన అవార్డును వేలం వేస్తే రూ.25లక్షలు వచ్చాయి. వాటిని మంచి పనులకు ఉపయోగించా. అసలు 'అర్జున్ రెడ్డి'కి నేను తీసుకున్న పారితోషికం రూ.5లక్షలు. అప్పట్లో అంత పెద్ద అమౌంట్ నేను చూడలేదు.

● 'కింగ్డమ్'లో పాట తీసేయాలన్న నిర్ణయం దర్శకుడు గౌతమ్, ఎడిటర్ నవీన్ నూలిదే. పాటను ముందుగానే విడుదల చేశాం. అందులో స్ప్రీ ఏజెంట్గా సమాచారాన్ని ఎలా సేకరిస్తానన్నది చూపించాం. అది అందరికీ తెలిసింది. దాని గురించి మళ్లీ 3 నిమిషాలు సినిమాలో ఎందుకనిపించింది. ఇప్పుడు తీయడంతో అందరూ అడుగుతున్నారు (నవ్వులు)

● ''షిప్ లాగే సీన్ ను మే నెలలో మండుటెండల్లో తీశాం. అది తీసేటప్పుడు ఓ మంచి సన్నివేశం చేస్తున్నామన్న సంతృప్తి ఉంది. 'జెర్సీ'లో ఉన్న మూమెంట్ అనే ఆలోచనతో చేయలేదు. ఇప్పుడు



ప్రేక్షకులు ఆ సీన్ గురించి గొప్పగా మాట్లాడటం చాలా సంతోషంగా ఉంది.

● ''నేను ఏ డైలాగ్ చెప్పినా యాసలో ఉందని అంటున్నారు. 'కల్కి'లో నాగ్ అశ్విన్ రాసిన డైలాగ్నే చెప్పాను. ఏం చేస్తాం. దేవుడు నాకిచ్చిన గొంతు అది. అసలు అర్జునుడు మాతృభాష ఏంటి?ఎలా మాట్లాడతాడు? ఏమైనా రిఫరెన్స్ లు ఉంటాయా? ప్రతి విషయంలోనూ యాస గురించి మాట్లాడితే నేనేం చెప్పను''

● ప్రస్తుతం రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో ఓ మూవీ చేస్తున్నా. రాయలసీమ నేపథ్యంలో సాగే కథ అది. అలాగే రవి కిరణ్ కోలాతో చేసే కథ కూడా చాలా వైవిధ్యమైనది. వాళ్లు సినిమా కోసం చేసే వర్క్ నాకు చాలా కష్టం. ప్రతిది డీటెలింగ్ గా చెప్పాలనుకుంటారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.